మెప్మాలో కొత్త సంఘాల జోష్

- జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్
- ఎస్‌హెచ్‌జీలో చేరికలపై అవగాహన
- ఇప్పటికే 145 నూతన మహిళా సంఘాల ఏర్పాటు
- కొనసాగుతున్న ప్రక్రియ

6



గోదావరి వరదను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీ



భద్రాచలం-చర్ల మధ్య తూరుబాక వద్ద డైవర్షన్ రోడ్డుపై వరద నీరు



భద్రాచలం వద్ద నీటమునిగిన కల్యాణకట్ట



భద్రాచలం-కూనవరం రోడ్డులో మురుమూరు వద్ద ప్రవహిస్తున్న వరద



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

వరద గోదావరి

- భద్రాద్రి వద్ద 48.30 అడుగులకు ప్రవాహం
- రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- దేవస్థానం కల్యాణ కట్ట కిందిభాగం నీట మునక
- చర్ల, కూనవరం వెళ్లే మార్గాల్లో నిలిచిన రాకపోకలు
- 50 అడుగులను దాటే అవకాశం ఉందంటున్న అధికారులు
- యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొంగులేటి ఆదేశం
- వరదను పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు

భద్రాచలం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఎగువన కురిసిన భారీ వర్షాలతో గోదావరి ఉధృతి పెరుగుతోంది. ఈ క్రమంలో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 24 గంటలుగా క్రమేపీ పెరుగుతుండగా.. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుతో పాటు ఇంద్రావతి, ప్రాణహిత నదుల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో భద్రాచలం వద్ద వరద ఉధృతి పెరుగుతోంది. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు 39 అడుగులున్న నీటిమట్టం బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు 40.4 అడుగులకు చేరింది. ఆ తర్వాత ఉదయం 6 గంటలకు 42.2, 8.15 గంటలకు తొలి ప్రమాద స్థాయి అయిన 43 అడుగులకు చేరడంతో భద్రాచలం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ట తొలి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఇదే సమయంలో గోదావరి పరివాహక ప్రాంతంలోని యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఇక 9గంటలకు 43.2 అడుగులున్న గోదావరి 12 గంటలకు 44.3, మధ్యాహ్నం 3 గంటలకు 45.4, సాయంత్రం 6 గంటలకు 46.6 అడుగులకు చేరింది. కాగా బుధవారం రాత్రి 10.05 నిమిషాలకు 48 అడుగులకు (మిగతా 6వ పేజీలో)

అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



ఖమ్మం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గోదావరి వరద పెరుగుతున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారులకు సూచించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజుతో మాట్లాడారు. ఎగువ వరద ఉధృతితో భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలో గోదావరి ప్రవాహం ఉందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తుమ్మల ఆదేశించారు.. భద్రాచలం రామాలయం వద్ద కరకట్ట స్లూయిస్ లీకేజీ కాకుండా చూడాలని, సుభాష్‌నగర్ వైపు వరద నీరు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది సమన్వయంతో సన్నద్ధంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్ టీంలు వైద్య సిబ్బందిని సిద్ధం చేయాలని, వాగులు దాటకుండా పోలీసు సిబ్బందిని గస్తీ ఉంచాలని, ఏ ఒక్కరికి ప్రాణనష్టం లేకుండా అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొనాలని సూచించారు.

గోదావరి పెరుగుతూ వచ్చిందిలా..

సమయం	(నీటిమట్టం అడుగుల్లో)
మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు	39 అడుగులు
బుధవారం ఉదయం 6 గంటలకు	42.2 అడుగులు
8.15 గంటలకు	43 అడుగులు (మొదటి ప్ర.హెచ్చరిక జారీ)
9 గంటలకు	43.2 అడుగులు
మధ్యాహ్నం 12 గంటలకు	44.2 అడుగులు
3 గంటలకు	45.4 అడుగులు
6 గంటలకు	46.6 అడుగులు
7 గంటలకు	47 అడుగులు
10.05 గంటలకు	48 అడుగులు (రెండో ప్ర. హెచ్చరిక జారీ)
11 గంటలకు	48.30 అడుగులు

మద్యం టెండర్లకు సై



- దుకాణాల లైసెన్సుల జారీకి షెడ్యూల్ విడుదల
- 5వేల జనాభాకు ఒక షాపు కేటాయింపు
- దక్కించుకునేందుకు వ్యాపారులు రెడీ
- రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెరిగిన దరఖాస్తు ఫీజు
- ఉమ్మడిజిల్లాలో ప్రస్తుతం 210 షాపులు..
- కొత్త పాలసీతో సంఖ్య పెరిగే అవకాశం

ఖమ్మం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : మద్యం జాతరకు రాష్ట్ర ప్రభుత్వం తెరలేపింది. షాపుల కేటాయింపు, తదితర ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్ జారీగా.. తేదీలు ఎప్పుడు ప్రకటించినా.. షాపులను దక్కించుకునేందుకు సై అన్నట్టుగా ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వ్యాపారులు సిద్ధంగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం మద్యం టెండర్లు నిర్వహించి.. ఆదాయం గడించింది. ఇది కొత్త ప్రభుత్వ ఆదాయానికి ఇబ్బంది తెచ్చిపెట్టింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్ నిర్వహించి ఆదాయం పెంచుకునేందుకు ఈ సారి దరఖాస్తు ఫీజును పెంచింది. ప్రస్తుతం ఖమ్మం జిల్లా పరిధిలో 122, భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో 88 షాపులున్నాయి. వాటి గత లైసెన్సుల గడువు నవంబరు 30తో ముగుస్తోంది. అయితే ప్రభుత్వం తెచ్చిన కొత్త పాలసీతో మద్యం షాపుల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తోంది. ఇక ఈసారి దరఖాస్తుల ఫీజును రూ.2లక్షల నుంచి రూ.3లక్షలకు పెంచిన ప్రభుత్వం.. 15శాతం షాపులను గౌడకులస్తులకు, 10శాతం ఎస్సీలకు, 5శాతం ఎస్టీలకు కేటాయించింది. 5వేల జనాభాకు (మిగతా 6వ పేజీలో)

రైతుల అవసరాల మేరకు యూరియా ఇవ్వాలి

కేంద్ర రసాయనాల, ఎరువుల మంత్రిత్వ శాఖకు మంత్రి తుమ్మల విజ్ఞప్తి



ఖమ్మం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర రైతుల వ్యవసాయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్రం ప్రకటించిన 50వేల మెట్రిక్ టన్నుల యూరియాను ఈవారంలోనే సరఫరా చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ఎరువులు, రసాయనాలశాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రి తుమ్మల బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. కాంగ్రెస్ తెలంగాణ ఎంపీలు చేసిన నిరసనతో రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు పడుతున్న ఇబ్బందులు కేంద్రరసాయనాలు, ఎరువుల మంత్రిత్వశాఖకు అర్థమయ్యాయన్నారు. రాష్ట్ర రైతుల కోసం కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీలు చేసిన పోరాటానికి గాను ప్రియాంకగాంధీతో పాటు ఇతర ఎంపీలకు తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు రాజకీయ స్వార్థంతో కుట్రలు పన్నుతున్నాయని, రైతులు ఆలోచించి అర్థం చేసుకోవాలన్నారు. తెలంగాణకు కేటాయించిన యూరియా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతూ సకాలంలో సరఫరా చేయడం లేదన్నారు. బీఆర్ఎస్ నేతలు వారి అనుచరులతో యూరియా కేంద్రాల వద్ద చెప్పులు క్యూలైన్‌లో పెట్టి రైతులతో ఆందోళన చేయిస్తున్నారని, ప్రజలు ఈ కుట్రలను అర్థం చేసుకోవాలన్నారు. వానాకాలంలో రాష్ట్రానికి 9.80లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం కేటాయించిందని, ఆగస్టు 31నాటికి 8.30లక్షల మె.ట. సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 5.42లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేశారని.. అందువల్లే యూరియా కొరత ఏర్పడిందన్నారు. ఈ నెలలో యూరియా వినియోగం అధికంగా ఉన్నందున అదనంగా 80వేల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని తుమ్మల కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం రైతులకు అన్ని వేళలా అండగా ఉంటుందని, తాము చిత్తశుద్ధితో ఎరువులు అందిస్తుంటే బీఆర్ఎస్, బీజేపీలు రాజకీయస్వార్థంతో ఆందోళనలు చేస్తున్నాయని మండిపడ్డారు.

మెప్మా పీడీగా నళినీ పద్మావతి



ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా జి. నళినీ పద్మావతిని నియమిస్తూ సీడీఎంఏ కార్యాలయం నుంచి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్ 1 మునిసిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆమె గత కొంతకాలంగా వెయిటింగ్‌లో ఉన్నారు. ఆమెకు ఖమ్మం మెప్మా పీడీగా బాధ్యతలు కేటాయించారు. గతంలో మెప్మా పీడీగా పనిచేసిన మహేందర్ హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ ఏవోగా బదిలీ కావటంతో ఇన్‌చార్జ్ పీడీగా ఖమ్మం కమిషనర్ అభిషేక్ అగస్త్య బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

కేఎంసీ ఉప కమిషనర్‌గా శ్రీనివాసరావు నియామకం

ఖమ్మం నగరపాలకసంస్థ ఉప కమిషనర్‌గా శ్రీనివాసరావును నియామకం చేస్తూ సీడీఎంఏ నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

'ఆరోగ్యశ్రీ'లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి
- హాస్పిటళ్లలో ధరల పట్టిక తప్పనిసరి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యశ్రీ అమలులో.. సీఎం రిలీఫ్‌ఫండ్‌లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోనున్నట్టు ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. ఇటీవలే ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ దుర్వినియోగం అక్రమాలకు పాల్పడుతున్న అంశాలపై ఆయన సీరియస్ అయ్యారు. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు విధిగా వైద్యఆరోగ్యశాఖ నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి ప్రైవేట్ డాక్టర్లు, ప్రైవేట్ హాస్పిటల్ మేనేజ్మెంట్ డైరెక్టర్లకు నిర్వహించిన అవగాహన, శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. హాస్పిటల్ మేనేజ్మెంట్ సిస్టం (హెచ్ఎంఎస్) వైద్య ఖర్చుల నియంత్రణ, క్లీనికల్ ఎస్టాబ్లిష్మెంట్, ఎంటీపీ యాక్ట్, ఐవీఎఫ్, సరోగసీ నియమాలను పాటించాలన్నారు. అన్ని ప్రైవేటు ఆస్పత్రులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలనే ఉద్దేశ్యంతోనే వైద్యచట్టాలపై శిక్షణ అందిస్తున్నామన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా క్లీనికల్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద నమోదు చేసుకోవాలన్నారు. ఆస్పత్రిలో వివిధ వైద్య సేవలకు వసూలు చేసే ఫీజుల వివరాలు, ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. నిరుపేదలకు ఎంపానెల్మెంట్ ఆసుపత్రులలో రూ. 10 లక్షల చికిత్స అందించాలన్నారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకం అమలు చేస్తుందని, ఈ పథకంలో అక్రమాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఒకే చికిత్సకు సీఎం రిలీఫ్ ఫండ్, ఆరోగ్యశ్రీ రెండు చోట్ల క్లెయిమ్స్ చేస్తున్నారని, ఈ పద్ధతి మారాలన్నారు. ఫర్టిలిటీ సెంటర్, ఐవీఎఫ్ క్లీనిక్, జెనెటిక్ కౌన్సిలింగ్, నర్సింగ్ హోమ్, డయాగ్నోస్టిక్, స్పీచ్ థెరపీ వంటి అనేక రకాల ఆసుపత్రులు వస్తున్నాయని, వీరందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. స్పీచ్ థెరపీ పేరుతో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, అక్కడ క్వాలిఫైడ్ వైద్యులు ఉన్నారా? వంటి అంశాలు పరిశీలించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ బి.కళావతి బాయి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చందునాయక్, డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో, స్టేట్ టీవోటీలు డాక్టర్ కల్పనతోరన్, ఎస్ఎంఓ డాక్టర్. మురారి రాజేంద్రప్రసాద్, డాక్టర్ నారా యణ మూర్తి, ప్రభుత్వ, ప్రైవేట్ గైనకాలాజిస్టు లు, రేడియోలజిస్టులు, డాక్టర్లు, హాస్పిటల్ మేనే జింగ్ డైరెక్టర్లు, డెమో సుబ్రహ్మణ్యం, స్టాటస్టికల్ ఆఫీసర్ నవీన్ కుమార్, డీపీఎం దుర్గ, హెల్త్ ఎడ్యుకేటర్ అన్వర్, డీడీఎం నాగరాజు, డీఎస్వో వేణు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వైద్యాధికారులు

ఏసీ మిర్చి ధర జిగేల్

ఖమ్మం మార్కెట్‌లో క్వింటా రూ.15,150.. ఒక్కరోజులో రూ.600 పెరుగుదల 7

ముంపు కలవరం

- మొదలైన వరదలు
- భయాందోళనలో గోదావరి తీర వాసులు
- గతాన్ని తలుచుకుంటూ ఆవేదన
- మళ్లీ వరద వస్తుందనే భయం
- వ్యవసాయం చేసేందుకు వెనుకంజ



2023, జూలై 18న తేగడ వద్ద పంట పొలాలను చుట్టుముట్టిన వరద (ఇన్‌సెట్‌లో) వరదలకు సర్వం కోల్పోయిన ఓ కుటుంబం(ఫైల్)

చర్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : 2023లో వచ్చిన గోదావరి వరదలకు చర్ల మండలం కకావికలమైంది. ఇళ్లు కూలిపోయి, పంటలు దెబ్బతిని, పశువులు చనిపోయి, వస్తువులు కొట్టుకుపోయి అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. నాడు గోదావరి మిగిల్చిన నష్టాన్ని నేటికీ మండల వాసులు పూడ్చుకోలేక పోతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తూ, గోదావరి పెరుగుతుండడంతో చర్ల మండలంలోని గోదావరి ముంపు వాసుల్లో కలవరం మొదలైంది. మళ్లీ గత ఏడాది వచ్చిన విధంగా వరదలు వస్తాయన్న భయం వారిలో పట్టుకుంది. వరి సాగు చేసేందుకు చాలా మంది రైతులు ముందుకు రావడం లేదు. మిర్చి సాగుదారులు గోదావరి తీరంలోని గ్రామాల్లో కాకుండా సుమారు 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలోని ఎత్తైన ప్రాంతాల్లో మిర్చి నారు పోస్తున్నారు.

కలవర పెడుతున్న వరద

2023, జూలై నెలలో వచ్చిన వరదలకు చర్ల మండలంలోని సుమారు 18 గ్రామాలు నీట మునగాయి, సుమారు 2200 ఇళ్లు, 4వేల విస్తీర్ణంలోని పొలాలు దెబ్బతిన్నాయి. మేకలు, కోళ్లు, ఆవులు వేలల్లో మృతి చెందాయి. సుమారు 18 గ్రామాల ప్రజలు కట్టుబట్టలతో మిగిలారు. నేడు గోదావరి పెరుగుతుండడంతో.. మళ్లీ అంతటి వరద వస్తుందా!? అనే చర్చ సాగుతోంది. ఇప్పటికే భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారి చేశారు అధికారులు. మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మూడవ ప్రమాద హెచ్చరిక కూడా దాటొచ్చునని కొంత మంది అధికారులు చెబుతున్నారు. దీంతో వరద తీవ్రత పై ముంపు వాసుల్లో తీవ్ర వేదన మొదలైంది. ఇప్పటికే వరద తీవ్రతకు వాజేడు వద్ద తెలంగాణ, చత్తీస్‌గడ్‌కు రాష్ట్రాలకు రాకపోకలు బంద్ అయ్యాయి.

వరద పెరిగితే పరుగే..

గోదావరికి వరద వస్తుండంతో చర్ల మండలంలోని ముంపు ప్రాంతాలను చర్ల రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. మండలంలోని గొంపల్లి, మొగళ్ళపల్లి, వీరాపురం, దండుపేట, మేడువాయి. ఇతర గ్రామాల వాసులను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భద్రాచలం వద్ద 50 అడుగులు దాటితే అన్ని గ్రామాలకు పునరావాస కేంద్రాలకు తరలిస్తామని అధికారులు చెబుతున్నారు.

వ్యవసాయానికి వెనుకంజ

గోదారి తీర ప్రాంత రైతులు ముంపు ప్రాంతాల్లో వ్యవసాయం చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. వరి, మిర్చి సాగు చేస్తే అకస్మాతుగా వచ్చే వరదలకు పంటలు దెబ్బతింటాయని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 2023, 2024లో వచ్చిన వరదలకు మంటలు కొట్టుకుపోయి, పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. ఈ ఏడాది కూడా ఆదే పరిస్థితి వస్తే తీవంగా నష్టపోతామని కొంత మంది రైతులు చెబుతున్నారు. అలాగే మిర్చి రైతులు వేలల్లో కొనుగోలు చేసిన విత్తనాలను ముంపు గ్రామాల్లో కాకుండా మండలానికి దూరంగా, వరద చేరని ప్రాంతాల్లో నారు మడులు పోస్తున్నారంటే.. పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

వరద ప్రవాహంతో నిలిచిన రాకపోకలు



తూరుబాక వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

దుమ్ముగూడెం ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి):గోదావరి వరదప్రవాహం పెరగడంతో భద్రాచలం-చర్ల ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. తూరుబాక వద్ద డైవర్షన్ రహదారి పైకి గోదావరి వరదనీరు పోటెత్తింది. పర్ణశాల నార చీరలు ముంపునకు గురయ్యాయి. సున్నంబట్టి-బైరాగులపాడుల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పర్ణశాల స్నాన ఘట్టాల వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ వివేక్‌రాంలు తమ సిబ్బందితో పరిస్థితిను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. చర్ల నుంచి భద్రాచలం వెళ్లే వాహనాలను ములకపాడు నుంచి రామచంద్రునిపేట మీదుగా మళ్లిస్తున్నారు.



మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

వరద పరిస్థితిని పరిశీలించిన కలెక్టర్

తూరుబాక డైవర్షన్ రోడ్ వద్ద గోదావరి వరద పరిస్థితిని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజులు బుధవారం పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తూరుబాక వద్ద రాకపోకలు నిలిచిపోతే, చర్ల వైపు నుంచి భద్రాచలం వచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను మ్యాపు ద్వారా పరిశీలించారు. అంతకు ముందు సబ్‌కలెక్టర్ మృణాల్‌శ్రేష్ఠ తూరుబాక, సున్నంబట్టి ప్రాంతాలను పరిశీలించి వరద పరిస్థితులపై స్థానికులు, అధికారులతో మాట్లాడారు. ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, డీఎస్పీ అశోక్, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ వివేక్‌రాం, రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మెప్మాలో కొత్త సంఘాల జోష్

- ఖమ్మం జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్
- ఎస్‌హెచ్‌జీలో చేరికలపై అవగాహన
- ఇప్పటికే 145 నూతన మహిళా సంఘాల ఏర్పాటు
- కొనసాగుతున్న ప్రక్రియ



కొత్త సంఘాలను ఆన్‌లైన్ చేస్తున్న టీఎంసీ, కంప్యూటర్ ఆపరేటర్లు

మున్సిపాలిటీ	ఆన్‌లైన్ జరిగిన సంఘాలు
ఖమ్మం	130
సత్తుపల్లి	8
మధిర	4
వైరా	3

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఖమ్మం నగర పాలక సంస్థతో పాటుగా సత్తుపల్లి, మదిర, వైరా, ఏదులాపురం మున్సిపాలిటీల్లో కొత్త సంఘాల ఏర్పాటు జోష్ కనిపిస్తోంది. ఇటీవల వెలుగుమట్ల అర్బన్ పార్కులో నిర్వహించిన మహిళా సంఘాలకు వడ్డీ రుణమాఫీ మంజూరు కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ..ప్రభుత్వం మహిళలకు ప్రత్యేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశ పెడుతుందని, మహిళలను కోటీశ్వర్లుగా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కానీ ఆ మేరకు అర్హత కలిగిన ప్రతీ మహిళను మహిళా స్వయం సహాయక సంఘంలో సభ్యులుగా చేర్చాలని మెప్మా డీఎంసీ, టీఎంసీ, సీవోలను కోరారు. దీంతో వెంటనే జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపటారు. ముఖ్యంగా ఖమ్మం నగరంలో మెప్మాలో విధానపరమైన నిర్ణయాలను తీసుకున్నారు. డివిజన్లు కొత్తా పాతా అనే భేదం లేకుండా ప్రతీ కమ్యూనిటీ ఆర్గనైజర్‌కు లక్ష్యాలను కేటాయించారు. దీంతో కొత్త సంఘాలు ఏర్పాటుపై రోజువారీగా డీఎంసీ, టీఎంసీలు రివ్యూలు చేపట్టారు. దీంతో కొత్త సంఘాల జోష్ కనిపిస్తొంది.

పనిచేసిన ఆర్పీలపైనే అధిక భారం

ఖమ్మం నగరంలో మెప్మా పరిధిలో 160 మంది వరకు రిసోర్స్ పర్సన్(ఆర్పీ)లు ఉన్నారు. ప్రతీ ఆర్పీ పరిధిలో కనీసం 20నుంచి 30 వరకు మహిళా స్వయం సహాయక సంఘాలు నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది. కానీ పనిచేసిన ఆర్పీలతోనే మెప్మా అధికారులు ఎక్కువ సంఘాలను ఆయా డివిజన్లలో నిర్మాణాలు చేయిస్తున్నారు. తక్కువ సంఘాలు ఉన్న ఆర్పీలను తొలగించడం, అదనంగా ఆర్పీలను నియామకం జరగడం లేదు. సరిగ్గా లక్ష్యాలు పూర్తి చేయ్యని డివిజన్లలో కొత్త ఆర్పీలను నియామకం చేయనున్నారు.

మహిళా సంఘాల్లో చేరికతో కానుకగా దసరా జత చీరలు

స్వయం సహాయక సంఘాల్లో ఉన్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం నుంచి దసరా కానుకను అందివ్వబోతుంది. ప్రతి మహిళా సభ్యురాలికి జత చీరలను ఇవ్వనున్నారు. ఈ మేరకు చేనేత నుంచి తయారీ చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 800 వరకు సంఘాలుఉండగా 80వేల మంది మహిళలకు రెండు జతల చొప్పున చీరలను అందించేందుకు మెప్మా అధికారులు సిద్ధంగా ఉన్నారు. సభ్యుల సంఖ్య పెరిగితే ఆ మేరకు దసరా కానుక అందనుంది. అదేవిదంగా ఇందిరా మహిళా శక్తి పథకాలు నుంచి పెట్రోల్ బంకులు, ఆహారపు ఉత్పత్తి కేంద్రాలు, పాఠశాల కమిటీలు, కుట్టు పనులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. ప్రతీ మహిళ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు మహిళా స్వయం సహాయక సంఘంలో ఉన్న వారికే ఎక్కువగా ప్రాధాన్యత కల్పిస్తున్నారు.

జ్వరం.. భయం!

- భద్రాద్రి జిల్లాపై విషజ్వరాల పంజా
- మంచాలకు పరిమితమవుతున్న జనం
- ఇంటింటి సర్వే చేపట్టిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది
- జిల్లావ్యాప్తంగా 1477 మంది బాధితుల గుర్తింపు



కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో వైద్య సేవలు పొందుతున్న రోగులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను విష జ్వరాలు వణికిస్తున్నాయి. రోజురోజుకూ జ్వరాల కేసుల నమోదు సంఖ్య రెట్టింపు కావడంతో.. స్థానికుల్లో భయాందోళన పెరుగుతోంది. అతిపెద్ద ఏజెన్సీ జిల్లా కావడంతో మారుమూల గ్రామాల ప్రజల్లో అవగాహన లేమితో.. ఈ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు విష జ్వరాల బారిన పడి మంచానికే పరిమితమవుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులతో పాటు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే రోగులకు వచ్చి.. వారి ద్వారా కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ప్రబలుతున్నాయి. ఫలితంగా జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీల సంఖ్య గణనీయంగా పెరిగిపోయి.. వైద్య సేవలు పొందేందుకు బారులు తీరుతున్నారు.

జిల్లాలో ఇంటింటికీ 'ఫీవర్ సర్వే'

జిల్లాలోని కొత్తగూడెం, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట, ఇల్లందు నియోజకవర్గాల్లోని మారుమూల ఏజెన్సీ ఆదివాసీ గ్రామాలలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల ప్రకారం.. డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మీ పర్యవేక్షణలో సిబ్బంది ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టారు. ఈ క్రమంలో నీరసంగా ఉండి జ్వరం, దగ్గు, జలుబు, వాంతులు, విరేచనాలు, తదితర వంటి సమస్యలతో బాధపడుతున్న వారి వివరాలను నమోదు చేసుకుంటూ ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు నివేదిక అందజేస్తున్నారు. జిల్లాలో గత నెల జూలై 7వ తేదీన ఇంటింటికి సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సర్వేలో 1400 మంది ఆశా వర్కర్లు స్థానిక మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఇంటింటికీ సర్వే చేపట్టారు. ఇప్పటివరకు జిల్లాలో 1,75,172 ఇళ్లల్లో ఫీవర్ సర్వే నిర్వహించగా.. 1477 మందికి జ్వరాలు ఉన్నట్లు గుర్తించి అధికారులకు వివరాలు అందజేశారు. అదే సమయంలో రోగుల నమూనాలను సేకరించే పనుల్లో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత రోగులు త్వరితగతిన కోలుకునే విధంగా సిబ్బంది సత్వరమే మెరుగైన వైద్య సేవలు, ఉచితంగా మందులను అందిస్తున్నారు.

అప్రమత్తంగా ఉంటేనే సంపూర్ణ ఆరోగ్యం : డీఎంహెచ్‌వో డాక్టర్ జయలక్ష్మీ

వర్షాకాలంలో వ్యాధుల సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. అప్పుడే ఆరోగ్యంగా ఉంటారు. అత్యవసరమైతే తప్పా.. వర్షాలకు ఇంట్లో నుంచి బయటకు రావొద్దు. ఒక వేళ వచ్చినా.. ఫుల్ రేన్‌కోట్, గొడుగు వంటి సామగ్రిని వినియోగించుకొని వర్షాలకు తడవకుండా జాగ్రత్తలు పాటించాలి. పరిశుభ్రంగా ఉంటూ ఎలాంటి నీరసం ఉన్నా.. వెంటనే స్థానికంగా ఉన్న వైద్యులను సంప్రదించాలి.

మద్యం టెండర్లకు సై

(5వ పేజీ తరువాయి)

ఒక మద్యం షాపు ఉండేలా కేటాయింపులు జరపనుంది. 50వేల జనాభా వరకు ఉన్న పట్టణాల్లో మద్యంలైసెన్సుకు రూ.50లక్షలు, 50వేలనుంచి లక్ష జనాభా ఉన్న పట్టణాల్లో రూ.60లక్షలు, లక్షనుంచి 5లక్షలు జనాభా ఉన్న పట్టణాల్లో రూ.65లక్షలు, 25లక్షల వరకు జనాభ ఉన్న నగరాల్లో రూ.85లక్షలు, 20లక్షలపైగా జనాభా ఉన్న నగరాల్లో రూ.కోటి 10లక్షలు లైసెన్సు ఫీజు నిర్ణయించారు. లక్ష జనాభ ఉంటే 20మద్యంషాపుల వంతున కేటాయించనున్నారు. ఉదాహరణకు ఖమ్మం నగరంలో 5లక్షల జనాభా ఉంటే 100మద్యం షాపులు ఏర్పాటు చేయనున్నారు. గతసారి టెండర్ల దరఖాస్తు రూ.2లక్షల కేటాయించడం ద్వారా ఖమ్మం జిల్లాలో ఎక్సైజ్ శాఖకు రూ.144.14కోట్ల ఆదాయం వచ్చింది. ప్రస్తుతం జిల్లాలో ఖమ్మం 1స్టేషన్ 24, ఖమ్మం 2స్టేషన్ 17, నేలకొండపల్లి15, వైరా13,మధిర 20, సత్తుపల్లి 23, సింగరేణి స్టేషన్ల పరిధిలో పది షాపులున్నాయి. ఈ డిసెంబరు 1నుంచి 2027వరకు రెండేళ్లపాటు కొత్త మద్యం పాలసీ అమల్లో ఉండనుండగా.. ప్రతీసారి టెండర్లకు సరిహద్దు ఏపీ నుంచి కూడా వ్యాపారులు రావడం, షాపులు దక్కించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈసారి కూడా ఏపీనుంచి వ్యాపారులు వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం.

గత నోటిఫికేషన్‌లో దరఖాస్తులు వచ్చాయిలా..

ప్రతీ మద్యం నోటిఫికేషన్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దరఖాస్తుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. తెలంగాణతో పాటుగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మద్యం వ్యాపారులు ఎక్కువ సంఖ్యలో ఖమ్మం జిల్లాలో మద్యం దుకాణాలకు టెండర్లు వేస్తుంటారు. గత మద్యం టెండర్లలో జిల్లా వ్యాప్తంగా 7 ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలోని 122 మద్యం దుకాణాలకు లాటరీ ద్వారా ఎంపికలు చేశారు. ఖమ్మం 1స్టేషన్‌కు 1,745, ఖమ్మం 2 స్టేషన్‌కు 1,175, నేలకొండపల్లి స్టేషన్‌కు 954, వైరా స్టేషన్‌కు 714, మధిర స్టేషన్‌కు 982, సత్తుపల్లి స్టేషన్‌కు 1,214, సింగరేణి స్టేషన్‌కు 421 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా 122 వైన్స్ దుకాణాలకు 2021లో 6,212 దరఖాస్తులు రాగా 2023లో మాత్రం రికార్డు స్థాయిలో 7,207 దరఖాస్తులు అందాయి. ఈసారి కూడా ఖమ్మం జిల్లాపరిధిలోని మద్యం షాపులకు మద్యంలైసెన్సు దరఖాస్తులు దాఖలు చేసే పరిస్థితి కనిపిస్తుంది. లాటరీలో దక్కి వారికే అదృష్టం కలిసి రానుంది. భద్రాద్రి జిల్లాలోని 88 దుకాణాలకు గతంలో 5,057 దరఖాస్తులు అందాయి.

ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఖమ్మం క్రీడాకారులు



వినయ్‌వర్మ



హన్సిని

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని పూణేలో ఈనెల 27 నుంచి 29 వరకు జరగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-15 జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు నగరానికి చెందిన వినయ్‌వర్మ, జీడీ. హన్సిని ఎంపికయ్యారు. సర్ధార్ పటేల్ స్టేడియంలో నిత్యం సాధన చేసే వారు ఈ నెల 18, 19 తేదీలలో ఇబ్రహీంపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో చూపిన ప్రతిభ ఆధారంగా జాతీయ పోటీలకు ఎంపికైనారు. జాతీయ పోటీలలో తెలంగాణ రాష్ట్ర జట్టుకు వారు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, పలు క్రీడా సంఘాల బాధ్యులు అభినందించారు. జాతీయ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఖమ్మం ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారిగా అఖిల

ఖమ్మం లీగల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారిగా గుడిసెల అఖిల నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం హైకోర్టు నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. అఖిలది మంచిర్యాల రాంనగర్ స్వస్థలం. ప్రస్తుతం ఈ ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారిగా.. ఖమ్మం ప్రత్యేక సంచార న్యాయస్థాన న్యాయాధికారి నాగలక్ష్మి ఇన్‌చార్జ్‌గా ఉన్నారు. త్వరలో అఖిల నాగలక్ష్మి నుంచి బాధ్యతలు స్వీకరించనున్నారు.

వరద గోదావరి



భద్రాచలం బ్రిడ్జి వద్ద వరద ప్రవాహ దృశ్యం

(5వ పేజీ తరువాయి)

చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 11 గంటలకు 48.30 అడుగుల వద్ద గోదావరి ప్రవహిస్తుంది. 12 గంటలకు 48.60 అడుగులకు చేరింది. ఈ క్రమంలో నీటిమట్టం క్రమంగా 50 అడుగుల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనావేస్తున్నారు.

దేవస్థానం కల్యాణకట్ట కింది భాగంలోకి నీరు

గోదావరి ఉధృతి కారణంగా భద్రాచలం స్నానఘట్టాల వద్ద ఉన్న దేవస్థానం కల్యాణ కట్ట కిందిభాగంలోకి నీరు చేరింది. స్నానఘట్టాలు సైతం పూర్తిగా మునిగాయి. దీంతో భక్తులు, పర్యాటకులు అటువైపు వెళ్లకుండా అధికారులు మెష్‌లను, బారికేడింగ్‌ను ఏర్పాటు చేశారు. పోలీసులు, గజ ఈతగాళ్లు తీరంలో మోహరించారు. ఇక భద్రాచలం నుంచి చర్ల వెళ్లే మార్గంలో దుమ్ముగూడెం మండలంలోని తూరుబాక వద్ద డైవర్షన్ రోడ్డు నీట మునగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే ఏపీలోని కూనవరం వెళ్లే మార్గంలో నెల్లిపాక, వీరాయిగూడెం, మొరుమూరు గ్రామాల వద్ద బుధవారం సాయంత్రం రోడ్డుపైకి గోదావరి వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కంట్రోల్ రూమ్ నెంబర్లు ఇవే

గోదావరి వరదల నేపథ్యంలో కొత్తగూడెం కలెక్టరేట్‌తో పాటు భద్రాచలంలోని సబ్‌కలెక్టరు, కార్యాలయం, ఐటీడీఏలలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఆ నెంబర్లను ప్రకటించారు. కొత్తగూడెం కలెక్టర్‌లో 08744 -241950 (ల్యాండ్‌లైన్), 9392919743(వాట్సప్), భద్రాచలం ఐటీడీఏలో కంట్రోల్ రూము నెంబరు 79952 68352, సబ్‌కలెక్టరు కార్యాలయంలో 08743-232444 (ల్యాండ్‌లైన్), 9347910737 (వాట్సప్) నెంబర్లలో ఫోను చేయడం, తగిన సమాచారం ఎప్పటికప్పుడు పొందొచ్చు.

అప్రమత్తంగా ఉండాలి: మంత్రి పొంగులేటి

గోదావరి రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరువవుతున్న క్రమంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని, కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు, మునిసిపల్, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలకు ముందుగానే సమాచారం అందించడంతో పాటు అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు తీసుకోవాలని సూచించారు.

పరివాహక ప్రజలు అధికారులకు సహకరించాలి

● కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు

గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోందని, ఈ క్రమంలో నదీ పరివాహకంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారులకు సహకరించాలని కలెక్టర్ జితేష్‌వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ కోరారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టిందన్నారు. పోలీసు సహా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో లోతట్టు ప్రాంత ప్రజలకు అండగా ఉంటామన్నారు. బుధవారం వారు దుమ్ముగూడెం మండలం తూరుబాక రహదారిపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిపాయింట్‌ను పరిశీలించారు. ఒక వేళ గోదావరి ఉధృతి పెరిగితే తీసుకోవలసిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం భద్రాచలం గోదావరి వరద కరకట్టపై నుంచి వరద ఉధృతిని పరిశీలించారు. భద్రాచలం పట్టణవాసులతో పాటు లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లేందుకు సిద్ధం గా ఉండాలని సూచించారు. ఈ సమయంలో వారు ఎన్డీఆర్ఎఫ్, డీడీఆర్ఎఫ్ బృందాలకు పలు సూచనలు చేశారు. వారి వెంట భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, నీటిపారుదలశాఖ ఈఈ ఎస్కే. జానీ ఉన్నారు.

పర్ణశాలలో రామకోటి లేఖనం

దుమ్ముగూడెం ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): భద్రాచల శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయంలో శ్రీరామ కోటి లేఖనాన్ని బుధవారం ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన 150 మంది భక్తులు ప్రత్యేకంగా తయారు చేసిన కార్డులపై 108 నామాలు గల రామకోటి లిఖించి హుండీకు సమర్పించారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోపేక్తంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌చార్జి అనిల్ కుమార్, ముఖ్య అర్చకులు భార్గవాచార్యులు, వెంకటాచార్యులు, నరసింహాచార్యులు, వరప్రసాదశర్మ తదితరులు పాల్గొన్నారు.



రామయ్య కల్యాణ దృశ్యం

పనుల జాతర

- 20 మండలాల్లో 571 గ్రామాలలో ఒకే రోజు పనుల ప్రారంభం
- ఖమ్మం కలెక్టర్ అనుదీప్ వెల్లడి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) :ఆగస్టు 22న పనుల జాతర- 2025 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో పూర్తి అయిన పనులకు ప్రారంభోత్సవం, కొత్త పనులకు భూమి పూజ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టేందుకు 'పనుల జాతర - 2025'ను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలోని 571 గ్రామాలలోఈ నెల 22న 'పనుల జాతర' నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందని తెలిపారు. ఉపాధి హామీ పథకం, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, స్వచ్ఛభారత్ విభాగాలలో చేపట్టిన పనులకు ఈ సందర్భంగా ప్రారంభోత్సవాలు, భూమి పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పనుల జాతర కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు ఆయా నియోజక వర్గాల పరిధిలో పాల్గొంటారని తెలిపారు. నూతన గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్వాడీ భవనాలు, స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) ద్వారా చేపట్టిన సెగ్రిగేషన్ షెడ్, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, "ఇందిరా మహిళా శక్తి ఉపాధి భరోసా" క్రింద వ్యక్తిగత ఆస్తుల కల్పన పనులు పశువుల కొట్టం, కోళ్ల, గొర్రెల షెడ్, పండ్ల తోటలు, వానపాముల ఎరువుల తయారీ, అజోలా పిట్ నిర్మాణం, "జల నిధి" కింద వాననీటి సంరక్షణ- భూగర్భ జలాలు పెంచే ఫారమ్ పాండ్స్, ఊట కుంటలు వంటి పనులకు ప్రారంభోత్సవాలు, భూమి పూజలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు.

'పనుల జాతర'ను విజయవంతం చేయండి: డీఆర్‌డీవో విద్యాచందన

కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన పనుల జాతర -2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా డీఆర్‌డీవో విద్యాచందన ఓ ప్రకటనలో కోరారు. పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులు, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, గ్రామీణ మంచినీటి సరఫరా ఆధ్వర్యంలో ఏకకాలంలో అన్ని పనులు ప్రారంభించడం కోసం పనుల జాతర 2025ని ఏర్పాటుచేశారని, ఈ పనులు ఈనెల 22న అన్ని నియోజకవర్గాల్లో ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రారంభించాలన్నారు. జిల్లాలో 2378 పనులకు గాను రూ.35.35 కోట్లు నిధులు ప్రతిపాదనలు చేశామన్నారు. ఈ పనులు మార్చి 2026 నాటికి పూర్తి చేయాలని కోరారు.

క్షేత్రస్థాయిలో సైబర్ మోసాలపై దృష్టి పెట్టాలి

- సీపీ సునీల్‌దత్



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలకు గురై పోగొట్టుకున్న నగదును బాధితులకు రీఫండ్ చేసే వరకు పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టిపెట్టాలని సీపీ సునీల్‌దత్ ఆదేశించారు. సైబర్‌మోసాలకు గురైన బాదితులకు రీఫండ్ చేయడంలో తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాలోని పోలీసు అధికారులకు సీపీ బుధవారం ఆయన కార్యాలయం నుంచి వీడియోకాన్ఫరెన్సు ద్వారా పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్ మోసాన్ని గుర్తించిన వెంటనే గోల్డెన్ అవర్‌లో సైబర్‌మోసం గురించి ఫిర్యాదు చేయడం చాలా ముఖ్యమని, నేరాన్ని సైబర్ సెక్యూరిటీ నివేదించడం వల్ల నిందితుడి బ్యాంకు ఖాతాలు, డిజిటల్ వాలెట్లలో కాజేసిన సొమ్మును స్తంభింపచేయడానికి ఎక్కువ అవకాశాలుంటాయన్నారు. సైబర్ నేరాలకు గురైన, బాధితులు 1930కు కాల్‌చేయడం, సైబర్‌క్రైం పోర్టల్‌లో వెంటనే ఫిర్యాదు చేయాలని కోరారు. సైబర్‌క్రైం ఏసీపీ ఫణిందర్, సీసీఆర్బీ ఏసీపీ సాంబరాజు, సీఐ స్వామి, ఎస్‌ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై కేసులు

ఖమ్మంక్రైం, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఎరువుల డీలర్లు యూరియా కావాలంటే ఇతర ఎరువులు, పురుగుమందుల కొనుగోలు చేయాలని రైతులకు షరతులు పెడుతున్నారని, అలా షరతులు పెడుతున్న 5 ఎరువుల దుకాణాలపై టాస్కుఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడిచేసి కేసులు నమోదు చేశారని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవడంలో భాగంగా టాస్కుఫోర్సు పోలీసులకు అందిన సమాచారం మేరకు బుధవారం నేలకొండపల్లి, చింతకాని, రఘునాధపాలెం, సత్తుపల్లి మండలాల్లో పలు ఎరువుల దుకాణాలలో సోదాలు నిర్వహించినట్టు తెలిపారు. యూరియాతోపాటు బయోస్టిమ్యులేట్ ట్యాగ్ చేసి యూరియాను విక్రయిస్తున్నట్లు గుర్తించామని, దీంతో 5 ఎరువుల దుకాణాల ట్రేడలైసెన్సులు రద్దుచేయాలని వ్యవసాయశాఖకు సిఫార్సు చేసినట్టు సీపీ తెలిపారు. రైతులు సైతం యూరియా కొనుగోలు సమయంలో షరతులు పెడితే తక్షణమే స్థానిక పోలీసులకు, వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ముమ్మరంగా 'చవితి' ఏర్పాట్లు

విగ్రహాల కొనుగోలులో నిర్వాహకులు నిమగ్నం
భారీగా పెరిగిన వినాయక ప్రతిమల ధరలు
మట్టి విగ్రహాల వైపు మొగ్గుచూపుతున్న యువత


విగ్రహాలు

ఖమ్మం ఖానాపురం హవేలీ/లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితికి మరో ఆరురోజులు మాత్రమేఉంది. ఈ నెల 27న పండుగకు నిర్వాహకులు మండపాల నిర్మాణం తదితర ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారు. ఇదే సమయంలో గణేష్ విగ్రహాలను ముందస్తుగానే కొనుగోళ్లతో మార్కెట్లో సందడి వాతావరణం కనిపిస్తోంది. గత ఏడాది కంటే ప్రస్తుతం మార్కెట్లో విగ్రహాల ధరలు రెట్టింపయ్యాయి. ముందుగానే విగ్రహాలను ఎంపిక చేసుకుని అడ్వాన్స్ చెల్లిస్తే కొంత ధరలు తగ్గుతాయన్న భావనలో చాలా మంది కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ప్రస్తుతం పలు ప్రాంతాల్లో విగ్రహాలు అమ్మకానికి సిద్ధంగా ఉండగా.. ఈసారి యువత మట్టి విగ్రహాల వైపు ఆసక్తి చూపుతున్నట్టు అమ్మకందారులు చెబుతున్నారు. కానీ మట్టితో చేసే భారీ విగ్రహాలు, వినూత్న రీతిలో ఉన్నవి లేకపోతుండటంతో కొంత నిరాశకు గురవుతున్నారని తెలిపారు. ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో విగ్రహాలు అమ్మకానికి ఉన్నాయని, రూ.4వేల నుంచి రూ.35 వేల వరకు ధరలున్నాయని తెలిపారు. నగరంలో ఇందిరానగర్, రోటరీనగర్, బల్లేపల్లి, వెంకటగిరి క్రాస్‌రోడ్డు, కోదాడ క్రాస్ రోడ్డు, బైపాస్ రోడ్‌లతో పాటు భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం, అశ్వారావుపేట తదితర పట్టణాలు, ప్రాంతాల్లో తయారు చేసి విక్రయిస్తున్నారు. సుమారు 200 మందికి పైగా కార్మికులు గత మూడు నెలలుగా ఈ విగ్రహాల తయారీలో నిమగ్నమై ఉన్నారు. ఇదిలాఉంటే కొందరు ఉత్సవ నిర్వాహకులు హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, సోలాపూర్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భారీ విగ్రహాలను తీసుకొస్తున్నారు.

మట్టి గణపతులే మేలు.. కానీ..

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన లంబోదరుడి విగ్రహాలు ఆకర్షణీయమైన రంగులతో రూపుదిద్దుకుంటున్నాయి. కానీ ఇవి పర్యావరణ కాలుష్యానికి కారణమవుతాయని ఎంతోమంది పర్యావరణవేత్తలు, కాలుష్య నియంత్రణ మండలి, పలు స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు పదేపదే చెబుతున్నారు. మట్టి గణపతులే మేలని, వాటిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు. కానీ ప్రజల్లో అంతగా మార్పు కనిపించడం లేదని, అవగాహనలోపంతో నూటికి 70శాతం పీవోపీ విగ్రహాలే కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈసారి మట్టి విగ్రహాల ధరలూ అమాంతం పెంచేశారు. ఉదాహరణకు రెండేళ్ల క్రితం రూ.3 వేలు ఉన్న 5 అడుగుల విగ్రహం ఈ ఏడాది రూ.8 నుంచి రూ.10 వేలకు పెరిగాయి. రంగులు, డెకరేషన్ వస్తువుల ధరలు పెరిగిన కారణంగా భారం పెరిగిందని తయారీదారులు పేర్కొంటున్నారు.


అమ్మకాలకు సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

విక్రయాలు తగ్గాయి

- మోరియా కామేశ్వర్, విగ్రహాల తయారీదారుడు, ఖమ్మం



ఈ ఏడాది విగ్రహాల విక్రయాలు బాగా తగ్గాయి. గతేడాది నవరాత్రుల ప్రారంభానికి ముందే విక్రయాలు పూర్తయ్యాయి. ఈ ఏడాది మిగులుతాయని అనిపిస్తోంది. ఖర్చులు పెరగటంతో ధరలు పెంచాల్సి వచ్చింది.

సోలాపూర్ నుంచి తెచ్చి విక్రయిస్తున్నా..

- సర్దార్ పున్నంసింగ్, విగ్రహాల విక్రయదారుడు, కొత్తగూడెం



గణనాథుల విగ్రహాలను సోలాపూర్, ఆదిలాబాద్ నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నా. 20 ఏళ్లుగా గణపతి విగ్రహాలను అమ్ముతున్నా. అడుగు నుంచి 10 అడుగులకు పైగా విగ్రహాలను భక్తులు కొనుగోలు చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది వేడుకలు వైభవంగా జరుగుతాయనిపిస్తోంది.

మట్టి విగ్రహాలనే పూజించాలి

- వినోద్ లాహోటి, స్తంభాద్రి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు



పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహలనే పూజించాలి. మండప నిర్వాహకులు ఈ దిశగా గణేష్ నవరాత్రులను నిర్వహించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి. మట్టి ప్రాధాన్యాన్ని, ప్రాశస్త్యాన్ని తెలుసుకోవాలి. ప్రభుత్వ, అధికారుల నియమ నిబంధనలను తప్పని సరిగా పాటించాలి.

ఏసీ మిర్చి ధర జిగేల్


మార్కెట్‌లో అమ్మకానికి వచ్చిన ఏసీ మిర్చి శ్యాంపిల్ బస్తాలు

ఖమ్మం మార్కెట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో తేజా రకం ఏసీ మిర్చికి ధర ఊపందుకుంది. జూలై నెలాఖరు వరకు మిర్చి క్వింటా రూ.13,500 నుంచి రూ.13,900 వరకు పలికిన ధర.. ఆగస్టు నెల ప్రారంభం నుంచి క్రమంగా పెరుగుతూ వస్తుంది. మూడు వారాల క్రితం ధరలతో పోలిస్తే క్వింటాకు రూ.1500 పెరగడం విశేషం. ఏసీ మిర్చికి దేశీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉండడంతో 15 రోజులుగా ధరలు పెరుగుతున్నాయి. మార్కెట్‌లో బుధవారం క్వింటా ఏసీ మిర్చి రూ.15,150 జెండాపాట ధరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. అంతే కాకుండా మరి కొందరు విదేశీ ఆర్డర్ల గిరాకీ కారణంగా క్వింటా రూ.15,500 వరకు కొనుగోలు చేశారని పలువురు పేర్కొన్నారు. మార్కెట్‌లో మంగళవారం క్వింటా ఏసీ మిర్చి రూ.14,550కు కొనుగోలు చేసిన వ్యాపారులు డిమాండ్ పెరగడంతో ఒక్క రోజులో క్వింటాకు రూ.600 వరకు అదనంగా ధర పెట్టి కొనుగోలు చేశారు. ఇదిలా ఉండగా మార్కెట్‌లో సాధారణ రకం తేజా మిర్చి (నాన్ ఏసీ) నాణ్యతని బట్టి క్వింటా రూ.7,000 నుంచి రూ.9,000 వరకు ధర పలుకుతుంది. ఏసీ మిర్చి ధర పెరగడంతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చిని అమ్మకానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇదిలా ఉండగా బుధవారం మార్కెట్‌కు సుమారు 239 శ్యాంపిల్ లాట్లు, 12,948 మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ ఛైర్మన్ యారగర్ల హన్మంతరావు, వైస్ ఛైర్మన్ తల్లాడ రమేష్, సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పర్యవేక్షించారు.

ప్రజల అభివృద్ధే ధ్యేయం కావాలి

ప్రజాభిప్రాయ సేకరణలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
సమస్యలు వివరించిన పార్టీల నేతలు



మణుగూరుటౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీ ప్రాజెక్టు విస్తరణకు సంబంధించి పర్యావరణ అనుమతుల కోసం బుధవారం ఏరియా ఓల్డ్ స్టోర్స్ గ్రౌండ్‌లో ప్రజాభిప్రాయ సేకరణ సభను స్థానిక సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సభాధ్యక్షుడిగా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, పర్యావరణ శాఖ అధికారులు మాజీ ప్రజాప్రతినిధులు ప్రభావిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. మణుగూరు ఓసీ కాలపరిమితి ముగియడంతో అదనపు బొగ్గు ఉత్పత్తుల సేకరణ కోసం మణుగూరు మండల పరిధిలోని రామానుజవరం, తిర్లాపురం గ్రామాలతో పాటు ఫారెస్టు భూమిని కూడా సింగరేణి సంస్థ తీసుకోనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. సింగరేణి కాలరీస్ సంస్థ తన అభివృద్ధితో పాటు పరిసర గ్రామాల ప్రజల బాగోగులు కూడా చూడాల్సిన నైతిక బాధ్యత ఉందన్నారు. పంటలు పండే భూములను ఓసీ విస్తరణలకు ఇచ్చే కుటుంబాలు రేపటి రోజున నిర్వాసిత ప్రజలుగా మారబోతున్నారని తెలిపారు. వారికి తగిన ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు ఉద్యోగాలు కల్పించాలన్నారు. అంతేకాకుండా నిరుద్యోగ యువతకు తగిన శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి వారు స్వశక్తితో జీవించే విధంగా తర్ఫీదును సింగరేణి సంస్థ కల్పించాలని కోరారు. ఓబీ కంపెనీల్లో ఉపాధి చూపాలన్నారు. కాలుష్య నివారణ చర్యలు ఖచ్చితంగా తీసుకునే బాధ్యత పర్యావరణ అధికారులు, సింగరేణి అధికారులు వహించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, రాంగోపాల్, సత్రపల్లి సాంబశివరావు, కురం రవి, వట్టం నారాయణ దొర, జావెద్ పాషా, నాసర్ పాషా, పలువురు రైతులు ప్రస్తుత ప్రభావిత గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకూడదని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్, ఇతర ఉన్నత శాఖల అధికారులు, పర్యావరణ శాఖ ఇంజనీర్ రవీందర్, మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారత్ లేబర్ ప్రజాపార్టీ రద్దుకు ప్రతిపాదన

కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో పోటీ చేయని రాజకీయ పార్టీని రిజిస్టర్డ్ పార్టీల జాబితా నుంచి తొలగించాలని ప్రతిపాదిస్తున్నట్లు భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. భారత్ లేబర్ ప్రజాపార్టీ గత ఆరు ఏళ్లుగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కానీ రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కానీ, ఉప ఎన్నికల్లో కానీ తమ అభ్యర్థులను పోటీకి నిలపెట్టలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజాప్రాతినిధ్యం చట్టం 1951 సెక్షన్ 29ఏ ప్రకారం ఆ పార్టీ విధి విధానాలు అమలు చేయలేదని కలెక్టర్ వివరించారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ప్రకారం తన అధికారులను వినియోగించుకుంటూ ఈ పార్టీని రిజిస్టర్డ్ పార్టీల జాబితా నుంచి తొలగించేందుకు ప్రతిపాదన చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రాతినిధ్యం ఏమైన ఉంటే అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ఈ నెల 25వ తేదీలోగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారికి అఫిడవిట్ సమర్పించాల్సిందిగా సూచించారు. భారత్ లేబర్ ప్రజాపార్టీపై ఈ నెల 29న విచారణ నిర్వహించనున్నందున పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి తప్పని సరిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. ఎలాంటి సమాధానం రాకపోతే పార్టీ తరపున ఏ అభ్యంతరం లేనట్టుగా పరిగణించి, ఎన్నికల కమిషన్ రద్దు ఉత్తర్వులు జారీ చేస్తుందని కలెక్టర్ స్పష్టంచేశారు.

28 తేదీలోపు 'బెస్ట్ అవైలబుల్ స్కూల్' ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 28వ తేదీలోగా బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 3, 5, 8వ తరగతుల్లో మిగిలిన సీట్లలో ప్రవేశం కోసం కోయ, గోండు, నాయకపోడు తదితర గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో మిగిలిన సీట్లలో ఖమ్మం జిల్లాకు చెందిన అర్హులైన గిరిజన విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. 3వ తరగతిలో నాలుగు సీట్లు, 5వ తరగతిలో రెండు సీట్లు, 8వ తరగతిలో 2 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. 30న ప్రాజెక్టు అధికారి అధ్యక్షతన ఐటీడీఏ భద్రాచలం ఆఫీసు నందు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను తరగతుల వారీగా లాటరీ పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక కుటుంబం నుంచి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేయు విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.రెండు లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్ష యాభై వేల లోపు ఉండాలన్నారు. అన్ని ధ్రువపత్రాలను జత చేసి ఈ నెల 28వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు ఉప సంచాలకులు, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం జిల్లా కలెక్టరేట్ ఖమ్మంలో దరఖాస్తులను సమర్పించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ప్రకటనలో కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంజనీరింగ్ యాజమాన్యాలు


ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంజనీరింగ్ కళాశాలల ఛైర్మన్లు

ఖమ్మం ఖానాపురం హవేలి, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ టోకెన్ అమౌంట్ సుమారు రూ.24కోట్లను వెంటనే ఇప్పించాలని వామపక్ష పార్టీల సెక్రటరీలను, ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులను కలవాలని నిర్ణయించుకున్నట్లు కళాశాలల అధిపతులు తెలిపారు. నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఉమ్మడి ఖమ్మంజిల్లాకు చెందిన 12 ఇంజనీరింగ్ కళాశాలల ఛైర్మన్లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ, మదర్ థెరిస్సా కళాశాల ఛైర్మన్ చలసాని సాంబశివరావు, శ్రీచైతన్య కళాశాల ఛైర్మన్ శ్రీధర్, ప్రియదర్శిని కళాశాల నవీన్, నేషనల్ డిగ్రీ కళాశాల భరత్, ధరిపల్లి కళాశాల కిరణ్, బొమ్మా కళాశాల రాజేశ్వరరావు, కే.ఎల్.ఆర్‌కు చెందిన మణి, సాయిస్ఫూర్తి నుంచి దాసరి ప్రభాకర్‌రెడ్డి, అబ్దుల్ ఖలామ్ నుంచి చావా లక్ష్మీనారాయణలు హాజరై మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో అత్యధిక భాగం హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలే కావున హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలను మినహాయించి మిగిలిన 8 జిల్లాలను రూరల్ జిల్లాలుగా భావించి కళాశాలల యాజమాన్యంతో కలిసి ప్రభుత్వంపై వత్తిడి తేవాలని నిర్ణయించారు.

ఎఫ్‌సీఐ గోదాముల వద్ద 'సీఎంఆర్'..


ఎఫ్‌సీఐ గోదాము వద్ద లారీలు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ డెలివరీ చకాచకా జరుగుతోంది. వాస్తవానికి ఈ ఏడాది వానాకాలం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ను ఆగస్టు 10 నాటికి మిల్లర్లు అందిచాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 12 వరకు మరో నెల రోజుల పాటు గడువును ప్రభుత్వం పెంచింది. జిల్లాలో పెండింగ్ ఉన్న 14శాతం సీఎంఆర్ డెలివరీ పూర్తి చేస్తున్నారు. ఈనేపథ్యంలో బుధవారం ఎఫ్‌సీఐ గోదాముకు లారీలు పెద్దసంఖ్యలో వచ్చాయి. సీఎంఆర్ గోదాముకు సరఫరా కావడంతో లారీలు బారులు తీరాయి. జిల్లాలో ఖరీఫ్ సీజన్ సంబంధించి లక్షా 98 వేల 69 మెట్రిక్ టన్నుల లక్ష్యానికి గాను ఇప్పటి వరకు లక్షా 69 వేల 549 మెట్రిక్ టన్నులు డెలివరీ పూర్తి చేశారు. ఇంకా 28వేల 520 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది. మంగళవారం రైసుమిల్లర్లతో ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మిల్లుల వారీగా పెండిం గులో ఉన్న బియ్యం డెలివరీపై సమీక్షించారు. దీంతో గోదాముల వద్ద బియ్యం లోడ్లతో లారీలు ఇలా దర్శనం ఇచ్చింది.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


ప్రసాద్ ఉపాధ్యాయుడు

అశ్వారావుపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండారిగుంపు గిరిజన ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు డి.ప్రసాద్ (38) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అన్నపురెడ్డిపల్లి మండలం, కట్టుగూడెంకు చెందిన డి.ప్రసాద్ అశ్వారావుపేట మండలం, బండారిగుంపు గిరిజన ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కట్టుగూడెంలో నివాసముంటూ రోజూ విధులకు వచ్చి వెళుతుంటారు. మంగళవారం రాత్రి నిద్రించిన ప్రసాద్ బుధవారం ఉదయం ఎంతకీ లేవకపోవడంతో తండ్రి రాజులు కుమారుడిని లేపే ప్రయత్నం చేశారు. కానీ అతను మంచంమీద విగతజీవిగ ఉండటాన్ని చూసి గుండెపోటుతో మృతి చెందినట్టు తండ్రి గుర్తించారు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నిండుంది. మృతుడికి ఒక కుమార్తె, భార్య గర్భిణీ. అతని మృతిపట్ల ఉపాధ్యాయ సంఘాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

పాల్వంచ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉంటూ మానసికంగా కుంగిపోయిన యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం సుగ్గల వెంకటసాయిరాం (36) ఖమ్మం నుంచి ఐదు ఏళ్ల క్రితం పాల్వంచకు వచ్చి ఓ ఫ్యాన్సీస్టోర్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 15న రాత్రి తన యాజమానికి ఫోన్‌చేసి ఆరోగ్యం సహకరించడం లేదని, మరుసటి రోజు పనికి రావడం లేదని చెప్పాడు. బుధవారం ఉదయం సదరు స్టోర్ యజమాని సాయిరాంను వెంటబెట్టుకుని రమ్మని చల్లగుండ్ల సైదులును పంపాడు. సాయిరాం అద్దెకు ఉంటున్న గదికి వెళ్ళిన సైదులు ఎంత పిలిచినా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. మృతదేహం నుంచి దుర్వాసన వస్తుండటంతో అతను షాపు యజమానికి సమాచారం అందించాడు. సాయిరాం తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందడం, అతను వివాహం చేసుకోకపోవడంతో కుంగిపోయి ఆతహత్యకు పాల్పడి ఉంటాడని షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

ఏట్లో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

మధిర రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి మధిర ఏట్లో గల్లంతైన వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైంది. మడుపల్లి గ్రామానికి చెందిన పెనరమల్లి వినోద్(34) మంగళవారం మధ్యాహ్నం చేపల వేటకు వెళ్లి నీటి ప్రవాహానికి కొట్టుపోయి గల్లంతయ్యాడు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు బుధవారం గాలింపు చర్యలు చేపట్టడంతో ఏట్లో వినోద్ మృతదేహం లభ్యమైంది. అనంతరం వినోద్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

29 మంది మావోయిస్టుల లొంగుబాటు

అందరిపై రూ.55.50లక్షల రివార్డు


దంతెవాడలో లొంగిపోయిన మావోయిస్టులు

చర్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్, దండెవాడ జిల్లాల్లో బుధవారం ఒకే రోజు 29 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరందరిపై రూ.55.50 వేల రివార్డు ఉన్నట్టు పోలీసులు పేర్కొన్నారు. నారాయణపూర్ జిల్లాలోని అబూజ్ మడ్ ప్రాంతానికి చెందిన 8మంది మావోయిస్టులు ఎస్పీ రాబిన్‌సన్ గుడియా ఎదుట లొంగిపోయారు. వీరంతా ఇంద్రావతి ఏరియా కమిటీ సభ్యులను, వీరిలో మావోయిస్టు పార్టీ డాక్టర్‌గా పనిచేస్తున్న ముఖేష్ ఉన్నాడని, ఇది మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బని ఎస్పీ తెలిపారు. ఈ అందరిపై రూ.30లక్షల రివార్డు ఉందన్నారు. అలాగే దంతెవాడ జిల్లా పోలీసులు ఎదుట 21మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ అందరిపై రూ.25.50 లక్షల రివార్డు ఉందని పోలీసులు పేర్కొన్నారు. మావోయిస్టులు లొంగిపోవాలని అడవుల్లో ఉండి సాధించేదేమీ లేదని పోలీసులు పేర్కొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం..!

పాఠశాల వద్ద వారం రోజుల్లో మూడు ప్రమాదాలు
అయినా పట్టించుకోని అధికారులు
పిల్లలను బడికి పంపాలంటే భయపడుతున్న తల్లిదండ్రులు


పాఠశాల భవనంలోకి దూసుకొచ్చి బోల్తాపడిన లారీ

చంద్రుగొండ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనంలోకి బుధవారం కర్ర లోడుతో వస్తున్న లారీ దూసుకుపోయి బోల్తా పడిన ఘటనలో పాఠశాల భవనం ధ్వంసమైయింది. పాఠశాలకు విద్యార్థులు చేరుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేకుంది. దీంతో విద్యార్థులు భయాందోళనలతో పరుగులు తీశారు. తరచూ ఈ పాఠశాల ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత వారం రోజుల్లో మూడు భారీ వాహనాలు పాఠశాల భవనంపైకి దూసుకుపోయ్యాయి. ఈ ఘటనల్లో పాఠశాల భవనంతో పాటు ప్రహరీ ధ్వంసం అయింది. ప్రమాదం జరిగే సమయంలో పాఠశాల నిర్వాహణ వేళలు కాకపోవటంతో ఎటువంటి ప్రాణహాని జరగలేదు. కానీ రూ.లక్షల విలువైన గోడలు కూలి ఆస్థినష్టం జరుగుతుంది. గత గురువారం ఐరన్ లోడు ఉన్న లారీ పాఠశాల ప్రహరీపై పడింది. అనంతరం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు పాఠశాల ఎదుట నిరసన చేపట్టారు. ఈ వరస ప్రమాదాలతో పిల్లలను బడికి పంపటానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇదిలా ఉండగా జాతీయ రహదారిని ఆనుకొని మూల మలుపు వద్ద ఉన్న ఈ పాఠశాల దశాబ్దాల కాలంగా ప్రమాదాలకు లోనవుతుంది. ఆయా సమయంలో ఎమ్మెల్యేతో పాటు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాలకు రక్షణ చర్యలు చేపడతామని హామీలు ఇస్తున్నారు. కానీ ఎటువంటి శాశ్వత చర్య చేపట్టలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలోని విద్యార్థుల ప్రాణాలతో ఎమ్మెల్యేలు, అధికారులు చెలగాటం ఆడుకుంటున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాల్వంచలో గంజాయి పట్టివేత?

ఛత్తీస్‌గఢ్ నుంచి తమిళనాడుకు తరలిస్తూ
జగన్నాథపురం వద్ద వ్యాన్ స్వాధీనం
గంజాయితో పాటు
ఆరు 9ఎంఎం పిస్టళ్లు కూడా..
ముగ్గురు నిందితుల అరెస్ట్?
వివరాలు వెల్లడించని అధికారులు

పాల్వంచ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం జగన్నాథపురం సమీపంలో మంగళవారం ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సుమారు 80 కిలోల గంజాయిని పట్టుకున్న విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. అయితే దీనిపై అధికారులు వివరాలు వెల్లడించక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. తమిళనాడు, కేరళకు చెందిన ముగ్గురు స్మగ్లర్లు ఛత్తీస్‌గఢ్‌లో నుంచి గంజాయి కొనుగోలు చేసి వ్యానులో లోడ్ చేశారు. వారు ఓ కారులో ఆ వ్యాన్‌ను అనుసరిస్తూ తమిళనాడు చేరుకోవడానికి భద్రాచలం మీదుగా తరలిస్తుండగా, పక్కా సమాచారం అందుకున్న భద్రాద్రి జిల్లా ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్వంచ మండలం జగన్నాథపురం వద్ద డీసీఎం వ్యాన్‌ను పట్టుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆ వెనుకే వస్తున్న కారులోని ముగ్గురిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వ్యాన్‌ను తనిఖీ చేయగా 80 కిలోల ఎండు గంజాయి లభించింది. దీంతో పాటు కారులోని ఇద్దరు వ్యక్తుల వద్ద ఆరు 9ఎంఎం పిస్టళ్లు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకుని పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని విచారించగా ఆ పిస్టల్స్‌ను హైదరాబాదుకు చెందిన ఓ గ్యాంగ్‌కు అందిచేందుకు తీసుకెళ్తున్నట్టు అంగీకరించారని తెలిసింది. అయితే వారిచ్చిన సమాచారంతో అధికారులు ఇల్లెందులోనూ అనుమానిత ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్టు సమాచారం. అధికారులు దీనిపై ఎలాంటి వివరాలు వెల్లడించక పోవడంతో గంజాయితో పాటు దొరికిన పిస్టల్స్ ఎక్కడివనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

తల్లాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తల్లాడ ఎస్‌ఐ ఎన్.వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం తల్లాడలో నిర్వహించిన సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమంలో ఎస్‌ఐ మాట్లాడుతూ అమాయకులను టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు అనేక విధాలుగా అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. వీటిలో భాగంగా ఓటీపీలు పంపిస్తూ పలానా బ్యాంకు లేదా సర్వీస్ నుంచి చేస్తున్నామని, మీకు వచ్చిన ఓటీపీ మాకు పంపించండి అంటూ బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును ఖాళీ చేస్తున్నారని తెలిపారు. దీని దృష్ట్యా అపరిచిత నెంబర్ల నుంచి ఫోన్ వచ్చినప్పుడు అప్రతమత్తంగా ఉండాలని అనవసరంగా ఎవరికి ఓటీపీలు చెప్పకూడదన్నారు. యువత బెట్టింగ్ అంటూ పెడదారిన పడుతున్నారని ఫోన్ల ద్వారా బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుని లక్షల్లో డబ్బులతో పాటు కొంతమంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారన్నారు. యువత ఇలాంటి బెట్టింగ్ యాప్‌లకు దూరంగా సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

తల్లాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం ఎన్టీఆర్ నగర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎన్టీఆర్ నగర్ వద్ద తల్లాడ- దేవరపల్లి జాతీయ రహదారిపై గాంధీనగర్ తండా నుంచి తల్లాడ వైపు నడుచుకుంటూ వస్తున్న గుర్తుతెలియని 65 ఏళ్ల వృద్ధురాలిని వెనుకనుంచి మిట్టపల్లి నుంచి తల్లాడవైపు వస్తున్న బైక్ ఢీకొంది. దీంతో వృద్ధురాలితో పాటు బైక్‌పై ఉన్న వెంగన్నపేటకు చెందిన జీనుగు వెంకట్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజేష్

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని టేకులపల్లిలోగల విద్యా శిక్షణా సంస్థ (డైట్) కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా ఎస్‌సీఈఆర్‌టీ డిప్యూటీ డైరెక్టర్ నాంపల్లి. రాజేష్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గత నెలలో ఉద్యోగ విరమణ చేసిన కె. సత్యనారాయణ నూతన ప్రిన్సిపాల్ రాజేష్‌కు అభినందనలు తెలిపి ఉద్యోగ బాధ్యతలు అప్పగించారు.


ఉద్యోగ బాధ్యతలు స్వీకరిస్తున్న రాజేష్

మంత్రి తుమ్మల సంతాపం

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన వెలగపూడి శివరామప్రసాద్ బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు. ఈసందర్భంగా టీడీపీలో శివరామప్రసాద్ సేవలను, ఈప్రాంత ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు.

జాబ్ రెడీనెస్ ప్రోగ్రాం


జాబ్ రెడీనెస్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులు

ఖమ్మం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోన్నేకల్లు పరిధిలో గల శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో సాఫ్ట్‌వేర్ సంస్థ అయిన ఐబీమ్ ఆధ్వర్యంలో జాబ్ రెడీనెస్ అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ రిసోర్స్ పర్సన్ తమన్నా శ్వేత విటల్ మాట్లాడుతూ క్యాంపస్ టు కార్పోరేట్ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పరిశ్రమకు సంబంధించిన టెక్నాలజీ సంబంధిత సమాచారం, కోర్సువేర్‌ను యాక్సెస్ చేయడానికి వీలుగా ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల చైర్మన్ శ్రీధర్ మాట్లాడుతు విద్యారంగంలో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ ద్వారా సమూలమైన మార్పులు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి గీతిక, ప్రిన్సిపల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, డాక్టర్ వి.సుదర్శన్, డాక్టర్ రాజేష్, వైశాలి తదితరులున్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ


బ్యాగులను పంపిణీ చేస్తున్న చేతన ఫౌండేషన్ సభ్యులు

నేలకొండపల్లి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగాపురంతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చేతన ఫౌండేషన్, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు తేజావత్ గోవిందరావులు సంయుక్తంగా బుధవారం స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలను వితరణ చేశారు. మండల విద్యాధికారి బాలిన చలపతిరావు విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. మొత్తం 40 మందికి బ్యాగులు, నోటు పుస్తకాలను అందచేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహిస్తూ, సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటున్న చేతన ఫౌండేషన్ సభ్యుడు ముత్తినేని సురేష్, టీపీటీఎఫ్ నాయకుడు గోవిందరావులను ఎంఈవో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనందరావు, వీవో చంద్రావతి, ఉపాధ్యాయులు వెంగళరావు, ఉపేందర్ తదితరులున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

చింతకాని, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు పెసర, ఇతర వాణిజ్య పంటలు నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని కొదుమూరు గ్రామంలో పెసర పంటను వారు పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పంట నష్టం నమోదు చేయాలని కోరారు. దొబ్బల వెంగళరావు, పదిమల వెంకట నర్సయ్య, సింగారపు సత్యనారాయణ, పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న దయాకరరెడ్డి

తిరుమలాయపాలెం, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతీ పేద కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికతోడ్పాటు అందించి అండగా ఉంటుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకరరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని ఆరోపించారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరావమకృష్ణ, మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, ఉన్నం రాజశేఖర్, టి.కిరణ్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఖమ్మం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతీ ఒక్కరు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంవీపాలెం పీహెచ్‌సీ డాక్టర్ బాలకృష్ణ ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇంటింటీ జర్వ సర్వేను నిర్వహించారు. ప్రస్తుతం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు గుర్తించిన డెంగ్యూ పాజిటివ్ కేసులు ఎనిమిది ఉన్నాయని తెలిపారు. వారందరికీ తగిన చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్యులు

పుడుతూ.. కుడుతూ

- దడ పుట్టిస్తున్న డెంగీ
- ఖమ్మం నగరంలో 19 కేసుల నమోదు
- అందుబాటులోకి రాని అదనపు సిబ్బంది
- వైద్య విభాగానికే పరిమితమైన డ్రై డేలు

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో దోమలు ప్రజల్ని దడ పుట్టిస్తున్నాయి. ప్రతి క్షణం పుడుతూ.. పెరుగుతూ.. కుడుతూ గత వారం రోజుల కాలంలోనే అనేక డివిజన్లకు డెంగీ మహమ్మారిని విస్తరింపజేశాయి. ప్రారంభంలో విలీన ప్రాంతాలకే పరిమితమైన డెంగీ కేసులు ఇప్పుడు ఖమ్మం నగర వ్యాప్తంగా నమోదు జరుగుతున్నాయి. కాగా ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో పరిధిలో విధులు నిర్వహిస్తున్న మలేరియా విభాగానికి నల్గురు పారిశుధ్య సిబ్బందిని కేటాయించాలని, డెంగీ కేసులు నమోదు జరిగిన ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులతో దోమల నివారణ మందులు పిచికారి చేయించేందుకు మలేరియా విభాగం అధికారులు కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు సాక్షత్తు కమిషనర్ అభిషేక్ అగస్త్య అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కు ఆదేశాలిచ్చారు.

అదనంగా మలేరియా విభాగానికి పారిశుధ్య కార్మికులు కేటాయింపుతో కొంతమేరా సిబ్బంది కొరత తీరే అవకాశం ఉంది. కాని ఆ దిశగా నలుగురు ఉద్యోగులు కేటాయింపు జరగలేదు. దీంతో ఉన్న కొద్దిపాటి సిబ్బందితోనే మలేరియా విభాగం సిబ్బంది నెట్టుకొస్తున్నారు.

ప్రారంభంలో డెంగీ కేసులు విలీన డివిజన్లకే పరిమితం కాగా, ఇప్పుడు నగరంలోని ముఖ్యమైన డివిజన్లకు పెరిగాయి. 1వ డివిజన్‌లో-1, 2వ డివిజన్‌లో-1, 5వ డివిజన్‌లో-2, 15వ డివిజన్‌లో-5, 17లో-1, 20లో-1, 22లో-1, 24లో-1, 25లో-1, 52లో-1, 57లో-3, 58లో-1 మొత్తం 19 కేసులు నమోదు జరిగాయి.

డీజిల్‌పై ఆంక్షలు

డెంగ్యూ వచ్చిన నివాసాలు, ప్రాంతాల్లో దోమల నివారణకు మందులు పిచికారి చేయించాల్సి ఉంటుంది. ఇందుకోసం మలేరియా విభాగానికి డీజిల్ అవసరం ఏర్పడుతోంది. గతంలో 50లీటర్లు డిజీల్‌ను కేటాయించి అవసరం మేరకు తిరిగి డిజీల్ రాసేవారు కాని ఇప్పుడు డీజిల్‌పై కోతలు విధించడంతో దోమల నివారణకు మందులు పిచికారి చేయించలేని పరిస్థితి ఏర్పడింది.

గత రెండేళ్లుగా ఖమ్మం నగరంలో దోమలు పుట్టకుండా.. కుట్టకుండా నినాదంతో వారంలో రెండు నుంచి



మూడు రోజులు పాటుగా డ్రై డేలు నిర్వహించారు. కమిషనర్లు సైతం ఉదయం సమయంలో పలు నివాసాలను స్వయంగా పరిశీలించేవారు. దీంతో అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది కూడా డ్రై డేలో యాక్టివ్‌గా పనిచేసే వాళ్లు. కాని ఈ సంవత్సరం డ్రై డే ల నిర్వహణపై విమర్శలు వెలువడుతున్నాయి. ప్రభుత్వం ఒక వైపు వంద రోజులు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్న కూడా ఖమ్మం నగరంలో ప్రతి రోజు రెండు డెంగీ కేసులు నమోదు కావడం ప్రజల్ని కలవరపెడుతోంది. కేవలం వైద్య విభాగం, అర్బన్ మలేరియా విభాగాల వైద్య సిబ్బంది మాత్రమే డ్రై డే కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు తెలుస్తోంది.

ఆర్టీసీ సిబ్బందికి పరామర్శ

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయం నుంచి బయటపడిన ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ జి.వెంకటయ్య, కండక్టర్ కె.కృష్ణయ్యలను కరీంనగర్ జోనల్ హాస్పిటల్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏవీ గిరిసింహారావు వరంగల్ లోని రోహిణి ఆసుపత్రిలో బుధవారం పరామర్శించారు. చికిత్స విధానాలు పరిశీలించారు. వైద్యానికి సంబంధించి ఆర్టీసీ అండగా ఉంటుందని కుటుంబసభ్యులకు తెలిపారు. సంస్థ అన్ని విధాల ఆదుకుంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.


డ్రైవర్ వెంకటయ్యను పరామర్శిస్తున్న గిరిసింహారావు

భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలి

» అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల ప్రాజెక్టులు సకాలంలో పూర్తి కావాలంటే ప్రణాళికాబద్ధంగా భూసేకరణ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం అదనపు కలెక్టర్ కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి నీటి పారుదల ప్రాజెక్టుల భూ సేకరణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకంలో ప్యాకేజీలలో మొత్తం 3778 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1964 ఎకరాలు మాత్రమే సేకరణ పూర్తి అయ్యిందని, మరో 1814 ఎకరాలు పెండింగ్ ఉందన్నారు. ఈ పథకంలో ప్యాకేజి 14, 15 లోని పెండింగ్ భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేయాలని, ప్యాకేజీ 13 సంబంధించి 167 ఎకరాలకు నోటిఫికేషన్ జారీ చేశామని, రైతులతో చర్చలు జరిపి సజావుగా జరిగేలా చూడాలన్నారు. ప్యాకేజీ 6లో 667 ఎకరాల భూమి, ప్యాకేజీ 2 లోని 510 ఎకరాల భూమి ఎంజాయ్ మెంట్ సర్వే, మార్కింగ్ సమాంతరంగా జరగాలన్నారు. ఎంజాయ్ మెంట్ సర్వే, పబ్లిక్ నోటిఫికేషన్ జారీ, అవార్డు జారీ, భూముల బదలాయింపుకు నిర్దిష్ట గడువు పెట్టుకుని పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. రాజేశ్వరి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ల్యాండ్ అక్విజిషన్ కలెక్టరేట్ సూపరింటెండెంట్ షాజియా సుల్తానా, నీటిపారుదల శాఖ అధికారులు ఈఈ బి.అర్జున్ డిప్యూటీ ఈఈ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఎరువుల కృత్రిమ కొరత సృష్టించొద్దు

» వ్యవసాయ సహాయ సంచాలకుడు సతీష్

నేలకొండపల్లి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు సతీష్, ఎస్ఐ పెంటరి సంతోష్‌లు ఎరువుల డీలర్లకు హెచ్చరికలు చేశారు. బుధవారం నేలకొండపల్లిలోని రైతు వేదికలో మండలంలోని ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. రైతుల అవసరాల మేరకు ఎరువులను అందించాలన్నారు. ఎరువుల పంపిణీలో సన్న, చిన్నకారు రైతులకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. అదే సమయంలో నానో యూరియా ఉపయోగాలను రైతులకు వివరించాలన్నారు. ఎరువులకు సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు స్టాక్ బోర్డుపై చూపించాలన్నారు. రికార్డులను సరిగా నిర్వహించాలన్నారు. ఎరువులను ఎక్కువ ధరకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవటంతో పాటుగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి ఎం.రాధ, ఏఈవోలు అరవింద్, ధాత్రి, డీలర్లు పాల్గొన్నారు.


డీలర్లతో మాట్లాడుతున్న అధికారులు

రాజీవ్ గాంధీ జయంతి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 21వ శతాబ్దంలో భారతదేశాన్ని సాంకేతిక విప్లవం దిశగా నడిపించిన ఘనత దివంగత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీకే దక్కిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40ఏళ్ల వయస్సులోనే దేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించి అనేక ఆధునిక మార్పులకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు


తిరుమలాయపాలెంలో....


డీసీసీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

తిరుమలాయపాలెం, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): మాజీప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిచారు. ఈకార్యక్రమంలో ఎస్‌కే కరీ,ం ఎస్‌డీ మదార్, కరీం, సైదా, నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

రూపాయికే నెలంతా అపరిమిత కాల్స్

» ఫ్రీడమ్ పేరుతో బీఎస్ఎన్ఎల్ కొత్త పథకం అమలు
» బీఎస్ఎన్ఎల్ పీజీఎం వెంకటేశం



ఖమ్మం మామిళ్లగూడెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్‌కు పూర్వ వైభవం తెచ్చేందుకు ఫ్రీడమ్ పేరిట కొత్త పథకం ప్రవేశపెట్టిందని బీఎస్ఎన్ఎల్ పీజీఎం వెంకటేశం తెలిపారు. రూపాయికే మొదటి నెలంతా అపరిమిత కాల్స్ అందించేలా ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫ్రీడమ్ పథకం పేరిట ప్రత్యేక ఆఫర్ ప్రకటించిందన్నారు. బుధవారం ఆయన జీఎం కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 31 వరకు కొత్తగా 4జీ కనెక్షన్ తీసుకునేవారు రూపాయి చెల్లిస్తే నెలంతా అపరిమిత కాల్స్ తోపాటు రోజుకు 2 జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు వినియోగించుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. వినియోగదారులకు మెరుగైన 4జీ సేవలు అందించేందుకు ఉమ్మడి జిల్లాలో బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సేవా కేంద్రాలను, 425 టవర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏలాంటి సాంకేతిక సమస్యలు లేకుండా వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇతర జిల్లాల్లో 'ఫ్రీడమ్ పథకానికి మంచి స్పందన వస్తోందని, వైఫైలో నాణ్యత పెంచేందుకు ఫైబర్ ద్వారా నెట్ కనెక్షన్లు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. బీఎస్ఎన్ఎల్‌ను ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డీజీఎం రాజశేఖర్‌బాబు, ఏజీఎం కె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుమలాయపాలెంలో మంత్రి పొంగులేటి పర్యటన

తిరుమలాయపాలెం, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం మండలంలో పర్యటించనున్నట్టు మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకరరెడ్డి తెలిపారు. మండలంలోని సుబ్లేడులో ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. పిండిప్రోలులో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో బాలికలకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సైకిళ్లు పంపిణీ చేస్తారు. అనంతరం ఆయగ్రామాల్లో జరిగే సభల్లో ప్రసంగిస్తారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అప్రమత్తత అవసరం

ఖమ్మం మార్కెట్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరమని సైబర్ క్రైమ్ డీఎస్పీ ఫణిందర్ అన్నారు. బుధవారం నగరంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన సైబర్ నేరాల అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బ్యాంకుల పేరుతో నేరగాళ్లు చేసే ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఆధార్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి: ఎంఈవో


విద్యార్థుల ఆధార్‌ను తీసుకుంటున్న మండల విద్యాధికారి చలపతిరావు

నేలకొండపల్లి, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆధార్ లేని విద్యార్థుల కోసం మండల వనరుల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి బాలిన చలపతిరావు కోరారు. బుధవారం మండల వనరుల కేంద్రంలో ఆధార్ కోసం వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంఈవో మాట్లాడారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆధార్ కార్డును కలిగి ఉండాలని, ఆపార్‌కు(ఆటోమాటిక్ అకడమిక్ పర్మినెంట్‌రిజిష్ట్రీ)అవసరమన్నారు. ఆధార్ కార్డులున్న వారు సైతం తప్పొప్పు ఉన్నట్లైతే వచ్చి సరి చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రుల ఆధార్ కార్డు, విద్యార్థి ఫొటో, స్టడీ సర్టిఫికెట్ తీసుకుని ఆధార్ సెంటర్‌కు రావాలన్నారు. తల్లిదండ్రుల ఆధార్ కార్డుపై విద్యార్థులకు రెసిడెన్షియల్ సర్టిఫికెట్ ఇస్తారని, అనంతరం రెసిడెన్షియల్ సర్టిఫికెట్ ఆధారంగా ఆధార్ కార్డునిస్తారన్నారు. ఆధార్ లేని విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దాదాపుగా 500 ఉన్నట్లుగా అంచనా వేశామన్నారు. ఆధార్ సెంటర్ ఎమ్మార్సీలో వారం రోజులు పాటు హైదరాబాద్‌లోని మాదాపూర్‌కు చెందిన బాట్రానిక్స్ అనే ప్రైవేటు సంస్థకు అప్పగించినట్లు చెప్పారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా ఆధార్ ఉండాలని ఎంఈఓ స్పష్టం చేశారు.

ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం

» సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

కొణిజర్ల, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీలు నిర్వీర్యం అవుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కొణిజర్లలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో ప్రత్యేక అధికారులు ఏమాత్రం పట్టించుకోక పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం గ్రామ పంచాయతీలకు కేటాయించిన ట్రాక్టర్లును కూడా తిప్పక పోవడంతో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయిందని ఆరోపించారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్ళపల్లి కృష్ణ, మండల కార్యదర్శి చెరుకుమళ్ళ కుటుంబరావు, నాయకులు కొప్పుల క్రిష్ణయ్య, బోయినపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

నైపుణ్యం ఉంటే విజయం సాధించొచ్చు

» కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి


సర్టిఫికెట్లు అందించిన అధికారులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నైపుణ్యత, క్రమశిక్షణ ఉంటే విజయం సాధించవచ్చునని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని టీటీడీసీలో మై భారత్ (ఎన్.వై.కే) ఖమ్మం ఆధ్వర్యంలో తెలంగాణ గ్రాడ్యుయేషన్ యూత్ అసోసియేషన్ వారిచే నిర్వహించిన కేంద్ర ప్రభుత్వ పథకాలపై జరిగిన వర్క్ షాప్‌లో లీడ్ బ్యాంక్ మేనేజర్ (ఎల్.డి.ఎం) రవి ప్రసాద్, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నకుల్ రెడ్డిలతో కలిసి మాట్లాడారు. అనంతరం వర్క్ షాపు నందు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.బి.ఐ ఆర్సెటి డైరెక్టర్ చంద్ర శేఖర్, మై భారత్ అకౌంట్స్ ఆఫీసర్ భాను చందర్, తెలంగాణ గ్రాడ్యుయేట్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడిరెక్క ఉమా శంకర్, ట్రైనర్ శివాజీ, మోటివేషనల్ స్పీకర్ తాటిపల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు .

ఆర్థికసాయం అందజేత

ఖమ్మంచర్చికాంపౌండ్, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సంఘ సభ్యుడు దేవసాని వీరకృష్ణ కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయాన్ని బుధవారం అందించారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లా వెంకటేశ్వర్లు వీరకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీరకృష్ణ కుటుంబానికి సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, జి.సూర్యప్రకాశరావు, కొండ పద్మ, జి. పాండు, విజయ శాంతి, జి.నాగేశ్వరరావు, రుద్రప్రదీప్, జల్లా వెంకన్న, తదితరులున్నారు.

వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

చింతకాని, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాలకు పెసర, ఇతర వాణిజ్య పంటలు నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని కొదుమూరు గ్రామంలో వర్షాలకు పాడైన పెసర పంటను వారు పరిశీలించారు. కోతకొచ్చిన పెసర పూర్తిగా పాడైందని, రైతన్నలు లక్షల్లో నష్టపోయారన్నరు. ప్రభుత్వం వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పంట నష్టం నమోదు చేయాలని కోరారు. నష్టపోయిన రైతుకు పంటకు తగిన పరిహారం అందజేయాలన్నారు. రైతు సంఘం నాయకులు దొబ్బల వెంగళ రావు, పదిమల వెంకట నర్సయ్య, సింగారపు సత్యనారాయణ, వేముల జానకిరాములు, గోగుల ఆది, కొల్లి రవి, షేక్ దస్తగిరి, కొండపర్తి బాలాజీ, నకనబోయిన కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

కారేపల్లి ఎంపీడీవోగా శ్రీనివాస్‌రావు

కారేపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల ఎంపీడీవోగా పొన్నూరు శ్రీనివాస్‌రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీఆర్డీఏ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాస్‌రావు కారేపల్లి మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఎంపీవో రవీంద్రప్రసాద్, ఈజీఎస్ ఏపీవో కోటేశ్వరరావులు స్వాగతం పలికారు. మండల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఆయన తెలిపారు.

ఇళ్లస్థలాల కోసం భూమి పరిశీలన

తల్లాడ, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం పినపాక గ్రామంలో బుధవారం ఇళ్లస్థలాల కోసం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి భూ పరిశీలన చేశారు. పినపాక గ్రామంలోని సర్వే నెంబర్లు 538,539 లోని భూమి పరిశీలించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ, మాజీ చైర్మన్ దివ్వెల కృష్ణయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాపా సుధాకర్, గుర్రం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాస్‌బుక్ నిబంధన లేకుండా యూరియా పంపిణీ చేయాలి

పెనుబల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పాస్‌పుస్తకాల నిబంధనలతో సంబంధం లేకుండా రైతులకు యూరియా పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన సీపీఎం పార్టీ కార్యకర్తల సమావేశంలో అయన మాట్లాడుతూ.. జూలైలో రావల్సిన యూరియా ఇప్పటివరకు రాకపోవడం, ఆగస్టులో అరకొరగా సరఫరా చేస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్న రైతులతోపాటు కౌలురైతులకు కూడా యూరియా సరఫరా చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు, మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, తడికమళ్ల చిరంజీవి, చమటా విశ్వనాథం, కండే సత్యం, నాగమణి, రామచంద్రుడు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీటీసీ మృతి



రామతులిశమ్మ (ఫైల్)

తల్లాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందుతూ తల్లాడ3 మాజీ ఎంపీటీసీ సభ్యురాలు వేమిరెడ్డి రామతులిశమ్మ (55) బుధవారం తెల్లవారుజామున మృతిచెందారు. కొన్నిరోజులుగా ఆమె అనారోగ్యంతో హైదరాబాదులోని కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఇటీవల శస్త్రచికిత్సల అనంతరం కోలుకుంటుందని భావిస్తున్న తరుణంలో మంగళవారం తిరిగి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన హైదరాబాదులోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా బుధవారం తెల్లవారుజామున కన్నుమూసింది. 2019లో రామతులిశమ్మ ఎంపీటీసీ సభ్యురాలిగా ఎన్నికకాగా 2024 వరకు బాధ్యతలు నిర్వహించారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

కల్లూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తోపుడు బండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్లూరు మండలం మర్లపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేసారు. హైదరాబాద్‌కు చెందిన సాఫ్‌వేర్ ఇంజనీర్ వరికూటి రూప స్పాన్సర్ చేసిన రూ.పదివేల విలువైన పుస్తకాలు, డైరీలు, పలకలు, ఇతర మెటీరియల్‌ను అందజేసారు. ఈ ఫౌండేషన్ నిర్వాహకుడు డయాల కిషోర్‌దత్, ప్రముఖులు లక్కినేని కృష్ణ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎర్రుపాలెం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బుధవారం లబ్ధిదారులకు అందించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫార్సుతో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 19మందికి రూ.13,71,500విలువ గల చెక్కులను మధిర ఏఎంసీ చైర్మన్ బండారు నరసింహారావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సహచర నాయకులతో కలిసి అందించారు. మండల కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు శీలం శ్రీనివాసరెడ్డి, సీనియర కాంగ్రెస్ నాయకులు చావా రామకృష్ణ, అనుమోలు వెంకటకృష్ణారావు, మలెల్ల లక్ష్మణరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఆత్మకమిటీ డైరెక్టర్లు, పలు గ్రామశాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎస్ఐ రామారావు

వైరా, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ ఏడో వార్డులో బుధవారం ఒక క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో 50మంది వృద్ధులకు దుప్పట్లను ఎస్ఐ పుష్పాల రామారావు, కాంగ్రెస్ నాయకుడు పణితి సైదులు పంపిణీ చేశారు. వృద్ధులకు దుప్పట్లు సమకూర్చిన క్రైస్తవ సంఘం నిర్వాహకులను ఎస్ఐ అభినందించారు. నాయకుడు పోటు మధుసూదన్, పణితి వెంకటేశ్వర్లు, పాస్టర్లు కేఎస్.పౌలు, తిమోతి, జయరాజు, క్రీస్తుదాసు, బిపిన్‌పాల్, నతానియేలు పాల్గొన్నారు.

వైరా అభివృద్ధికి ప్రతిపాదనలు పంపండి

- కలెక్టర్ అనుదీప్



మత్స్యశాఖ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

వైరా, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ వద్ద ఉన్న పర్యాటక కేంద్రం అభివృద్ధికి, మత్స్యవిత్తనోత్పత్తి కేంద్రంలో అభివృద్ధి పనులకు వెంటనే ప్రతిపాదనలు పంపించాలని ఆ శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ అనుదీప్ మత్స్య విత్తనోత్పత్తి కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. చేపపిల్లల ఉత్పత్తికి సంబంధించిన తల్లి చేపలను చూశారు. ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఇక్కడ ఉత్పత్తి చేస్తున్న గంబూషియా చేపపిల్లలను ఆయన పరిశీలించారు. మలేరియా, చికెన్‌గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులను అరికట్టేందుకు గంబూషియా చేపపిల్లలు దోహదపడతాయని జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. హేచరీస్‌లో తయారైన చిచ్చుర చేపపిల్లలను పరిశీలించారు. మత్స్య విత్తనోత్పత్తి కేంద్రంలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించాలని, నిరుపయోగంగా ఉన్న సిమెంట్ నర్సరీలకు మైనర్ రిపేర్లు చేయించి వైట్‌వాష్ వేయించాలని మునిసిపల్ కమిషనర్ చింతా వేణును కలెక్టర్ ఆదేశించారు. వైరా రిజర్వాయర్ పక్కనే ఉన్నందున చేపపిల్లల ఉత్పత్తి లక్ష్యాలను పెంచుకొని మునిసిపల్ కమిషనర్‌తో సమన్వయం చేసుకొని అన్ని నర్సరీల్లో చేపపిల్లలు పెంచేవిధంగా, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. మళ్లీ పది రోజుల్లో ఈ క్షేత్రాన్ని సందర్శిస్తానని అప్పటివరకు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు జరగాలని స్పష్టం చేశారు. ఇక్కడ అభివృద్ధి, సౌకర్యాలకు అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని శివప్రసాద్‌ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం వైరా రిజర్వాయర్ గుట్టలపైనున్న పర్యాటక కేంద్రాన్ని పరిశీలించారు. బోటింగ్ ప్రాంతాన్ని, ఆనకట్ట కింది భాగంలో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. పర్యాటకం అభివృద్ధి కోసం అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని జిల్లా టూరిజం అధికారి సుమన్ చక్రవర్తిని ఆదేశించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, ఐబీ ఏఈఈ వెంకట్రాములు పాల్గొన్నారు.

సీనియర్ నేత వెలగపూడి మృతి



నివాళులర్పిస్తున్న కమల్‌రాజ్, నాయకులు

మధిర రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెలగపూడి శివరాంప్రసాద్(75)బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఆపార్టీలో ఉన్న ఆయన టీడీపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో పనిచేశారు. ముఖ్యంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావుకు, టీడీపీ సీనియర్ నేత డాక్టర్ వాసిరెడ్డి రామనాథానికి ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. ఉమ్మడి ఏపీలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రమార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా పనిచేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావులు ఫోన్లో కుటుంబసభ్యులతో మాట్లాడి ఓదార్చారు. మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, టీడీపీ ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథంతోపాటు పలు పార్టీల నాయకులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు వెలగపూడి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు

- రేజర్లలో పర్యటించిన సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్, ఎమ్మెల్యే రాగమయి



సత్తుపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికీ ఇళ్లు, ఇళ్లస్థలాలను ప్రభుత్వం అందజేస్తుందని సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఎమ్మెల్యే డా.రాగమయి అన్నారు. బుధవారం సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో పర్యటించిన సందర్భంగా ఇళ్లస్థలాలను పరిశీలించారు. గ్రామంలో ఇటీవల మట్టితో పూడ్చిన పాత ఎన్టీఆర్ కాలువ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఇటీవల కురిసన భారీవర్షాలతో జలకళను సంతరించుకున్న రేజర్ల పెద్ద చెరువును పరిశీలించారు.

ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయాలి: డీపీవో



ఇళ్లను పరిశీలిస్తున్న డీపీవో ఆశాలత

బోనకల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని డీపీవో ఆశాలత ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆమె పరిశీలించారు. బోనకల్‌లో 31 ఇళ్లు మంజూరు కాగా అన్ని ఇళ్ల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమయ్యేలా కృషి చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. డీపీవో వెంట ఎంపీవో వ్యాకరణం వెంకట సుబ్రమణ్య శాస్త్రీ ఉన్నారు.

మధిర రూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మధిర మండలంలో పలు గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత కోరారు. బుధవారం మధిర మండలం సిరిపురం, దెందుకూరు, చిలుకూరు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆమె పరిశీలించారు. ప్రస్తుత వర్షాకాల సీజన్ కావడం వలన గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, పీఎం ఆవాసయోజన, స్వచ్ఛ పర్యవేక్షణపై సమీక్ష నిర్వహించి మండల అధికారులకు సూచనలు చేశారు. ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో శాస్త్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



ఏన్కూరులో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్



కారేపల్లిలో..

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు పలు ప్రాంతాల్లో ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ టెలికాం రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత ఆయనకే దక్కిందని కొనియాడారు. ఈ సందర్భంగా పలు చోట్ల నాయకులు మొక్కలు నాటారు.



తల్లాడలో..



కల్లూరులో..

తమ్మిలేరుపై కొత్త బ్రిడ్జి నిర్మించండి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని తమ్మిలేరు వంతెనపై నూతనంగా బ్రిడ్జిని నిర్మించి ప్రమాదాలను నివారించి వాహనదారులను కాపాడాలని సీపీఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం బ్రిడ్జిపై వాహనదారులతో కలిసి బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను పరిశీలించినట్లు ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాసరావు తెలిపారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ బ్రిడ్జి ప్రమాదకరంగా మారిందని, బ్రిడ్జిపై గుంతలు ఏర్పడటంతో పాటు రెయిలింగ్ పటిష్టంగా లేదని, మరమ్మతులు కూడా నెలల తరబడి చేయడంతో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రజలందరూ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అయోమయంలో ఉన్నందున ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నూతనంగా బ్రిడ్జిని నిర్మించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాల బుచ్చయ్య, అయినంపూడి ననందరావు, తోటకూర వెంకట్రావ్, సాదు పున్నమయ్య, కొలికపోగు జగపతి రావు, నప్పిడి భాస్కర్, మహేష్, రాంబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాల్వ సుజాతపై అసత్య ఆరోపణలకు ఖండన

వైరా, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేస్తున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతపై చేస్తున్న ఆరోపణలను వైరా ఆర్యవైశ్యసంఘం నాయకులు ఖండించారు. ఆమెపై ఆరోపణలు ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా ఉన్నాయని నాయకులు మిట్టపల్లి నాగి, గ్రంధి ప్రవీణ్ ఆక్షేపించారు. సుజాతపై అసత్య ఆరోపణలను మానుకోకపోతే తగిన గుణపాఠం చెపుతామని హెచ్చరించారు. మిట్టపల్లి రాఘవరావు, శ్రీనివాసరావు, అనుమోలు భాస్కర్‌రావు, తాటికొండ రాము, మైలవరపు శ్రీనివాసరావు, రాయల నాగేశ్వరరావు, కొణతం రాజారావు పాల్గొన్నారు.

రహదారులపై చెత్తాచెదారం.. పట్టించుకోని యంత్రాంగం

- అధ్వానంగా ఎన్టీఆర్ నగర్, రేజర్ల మార్గం
- కోతులు, కుక్కలతో ప్రమాదాలు



రోడ్డుపై పడి ఉన్న చెత్తచెదారం

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆ రోడ్డుగుండా నిత్యం వేలాది వాహనాలు, వీఐపీలు, ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు ప్రయాణం చేస్తుంటారు. అయినా ఆ రహదారికి ఇరువైపులా ఉన్న సమస్య ఎవరికీ కానరావడం లేదు. ఈ సమస్య కొన్నేళ్లగా ఉన్నప్పటికీ సర్పంచ్‌ల పాలన ముగిసిన తర్వాత మరింత పెరిగి స్థానికులు రోగాలతోపాటు వాహనదారులు ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. సత్తుపల్లి మునిసిపాలిటీ శివారు ఎన్టీఆర్ నగర్ దాటిన తర్వాత మండలంలోని కొత్తూరు గ్రామ పంచాయితీ పరిధిలోని రేజర్ల వైపు వెళ్లే ఈ రహదారిపై చెత్తాచెదారం నిత్యం దర్శనమిస్తోంది. పట్టణంతోపాటు స్థానికులు, కొందరు వ్యాపారస్థులు చెత్తాచెదారం వేయడంతోనే ఈ సమస్య ఎదురవుతుంది. భవన నిర్మాణ వ్యర్థాలు, వాడేసిన కొబ్బరిబోండాలు, ఖాళీ మందు సీసాలు, మాంసపు వ్యర్థాలు, మిగిలిన ఆహార పదార్థాలు రోడ్డుకు ఇరువైపులా విసిరేస్తుంటారు. కోతులు, కుక్కలు వీటిని తినేందుకు ఎగబడుతుండటంతో ఇరువైపులా ఉరుకులు పెట్టే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

దుర్వాసన.. పట్టించుకోని యంత్రాంగం

ముఖ్యంగా సర్పంచ్‌లు పదవీ కాలం ముగియడంతో ఈ రోడ్డుపై చెత్తాచెదారం ఎప్పుడూ దర్శనమిస్తుంటుంది. మండల ప్రజా పరిషత్ అధికారులు, స్పెషలాఫీసర్ ఈ సమస్యపై దృష్టి సారించకపోవడంతో నిత్యం దుర్వాసనతోనే ప్రయాణించాల్సి వస్తుందని వాహనదారులు వాపోతుండగా సమీప ప్రాంత ప్రజలు రోగాల బారిన పడుతున్నామని గగ్గోలు పెడుతున్నారు. ఇదే విషయమై ఎంపీడీఓ చిన్న నాగేశ్వరరావును వివరణ కోరగా చెత్తాచెదారం తొలగించి చర్యలు తీసుకుంటామన్నారు.

కోతులు, కుక్కలకు వైరస్..

ప్రదీప్‌కుమార్, సహాయ సంచాలకులు, సత్తుపల్లి

మాంసపు వ్యర్థాలు, కుళ్లిన ఆహారాన్ని తినేందుకు పందులు, కోతులు, కుక్కలు స్వైరవిహారం చేయడంతో వాటికి ఆరోగ్యరీత్యా జబ్బులు రావడంతో, వైరస్ సోకి మనుషులను, పశువులను కరిస్తే రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. రేబీస్ సోకిన వెంటనే చికిత్స చేయించుకోకపోతే ప్రాణాలకే ప్రమాదమని, సంబంధిత అధికారుల చొరవ తీసుకుని చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలి.

వీఎంబంజర్ బస్టాండ్‌లో పారిశుధ్య పనులు

పెనుబల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది బస్సులు, వేలాదిమంది ప్రయాణీకులు వచ్చి వెళ్లే వీఎంబంజర్ బస్టాండ్‌లో ఆర్టీసీ స్టేషన్ మేనేజర్ రవీంద్రనాథ్ బుధవారం పారిశుధ్య పనులు చేయించారు. వీఎంబంజర్ బస్టాండ్‌లో డ్రెయినేజీ, మూత్రశాలలు లేకపోవడం, ప్లాట్‌ఫాంపై గోతులేర్పడడంతో తదితర అంశాలపై ఫిర్యాదులు రావడంతో సత్తుపల్లి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు పారిశుధ్య పనులు నిర్వహించారు.

ఎరువుల దిగుమతులను పరిశీలించిన డీఏవో

చింతకాని, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చింతకాని మండలం పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌లో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల పంపిణీను డీఏవో ధనసారి పుల్లయ్య బుధవారం పరిశీలించారు. ర్యాక్ పాయింట్‌కు 964.80 టన్నుల యూరియా, 701 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను జిల్లాలోని మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లకు సరఫరా చేశామన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో పవన్‌కుమార్, ప్రైవేటు ఎరువుల డిస్ట్రిబ్యూటర్ల సంఘం జిల్లా బాధ్యులు పుల్లఖండం నాగేందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు కాంతమ్మ కన్నుమూత

కారేపల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విశ్వనాధపల్లి గ్రామంలో శతాధిక వృద్ధురాలు బాగం కాంతమ్మ(101)బుధవారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న కాంతమ్మ బుధవారం మృతిచెందారు. మృతురాలు కాంతమ్మకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె అంత్యక్రియలకు పరిసర ప్రాంతాల నుంచి బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

పెనుబల్లి, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి మండలం టేకులపల్లిలోని ఆదర్శ పాఠశాలను బుధవారం అదనపు కలెక్టర్ శ్రీజ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు తక్కువగా ఉండడంతో పాఠశాలకు హాజరయ్యేవిధంగా కృషిచేయాలని ప్రిన్సిపాల్ రూపస్‌ను ఆదేశించారు. ఆ తర్వాత పాఠశాలతో అనుబంధంగా ఉన్న వసతి గృహంలో మెనూ ప్రకారం విద్యార్థులకు పెడుతున్నారా లేదా అని తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. వందశాతం ఉత్తీర్ణతోపాటు ఉత్తమ ఫలితాలు వచ్చేలా కృషిచేయాలని సూచించారు. పాఠశాలలో అటెండర్, నైట్‌వాచ్‌మెన్ జీతాల చెల్లింపు విషయమై వచ్చిన ఫిర్యాదును పరిశీలించాలని ఎంఈవో సత్యనారాయణను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్యూమరేటర్లకు పారితోషికం ఇవ్వాలి

కల్లూరు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎన్యూమరేటర్లకు పారితోషికం ఇవ్వాలని కోరుతూ మెప్మా రిసోర్స్ పర్సన్, ఐకేపీ వీవోఏలు బుధవారం కల్లూరు ఎంపీడీవో చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. గతేడాది ప్రభుత్వ ఆదేశాల మేరకు వీవోఏలు, మెప్మా రిసోర్స్ పర్సన్‌లు కుటుంబ సర్వేలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. అప్పట్లో సర్వేలో పాల్గొన్న సిబ్బందికి అధికారులు ఇచ్చిన హామీ మేరకు పారితోషికం వెంటనే అందించే ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా రిసోర్స్ పర్సన్‌లు, ఐకేపీ వీవోఏలు రమాదేవి, నాగలక్ష్మి, సునీత, లక్ష్మి, ఫాతిమాలు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతి తీసుకోవాలి

తల్లాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గణేస్ ఉత్సవాలకు నిర్వాహకులు పోలీసుశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు. వినాయక విగ్రహం పెట్టే వద్ద తలదాత అంగీకారం పత్రం విద్యుత్‌శాఖ వారి అనుమతిపత్రాలను పోలీసులకు అందించాలని సూచించారు. డిజేను అనుమతించేది లేదని, ఎవరైనా శృతిమించి చట్టవ్యతిరేకా కార్యకలాపాలకు పాల్పడతే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఎరువుల కృత్రిమ కొరతను సృష్టిస్తే చర్యలు తప్పవు

బోనకల్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కృత్రిమ కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయ చంద్ర హెచ్చరించారు. మండలంలోని రావినూతల, బోనకల్ సొసైటీలతో పాటు డీలర్ల దుకాణాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలను పరిశీలించారు. రైతులు యూరియాను అవసరం మేరకు వాడుకోవాలని, ఎవ్వరు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఏవో పి. వినయ్ కుమార్, ఏఈవోలు గోగుల హరికృష్ణ పాల్గొన్నారు.

అధికారుల పాలనలో పంచాయతీలు నిర్వీర్యం

- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

కొణిజర్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం అవుతున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కొణిజర్లలో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో ప్రత్యేక అధికారులు ఏమాత్రం పట్టించుకోక పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తాళ్ళపల్లి క్రిష్ణ, మండల కార్యదర్శి చెరుకుమళ్ళ కుటుంబరావు, నాయకులు కొప్పుల క్రిష్ణయ్య, బోయినపల్లి శ్రీనివాసరావు, మోత్కూరి వెంకటేశ్వరరావు, అంజయ్య, విజయ, కాటయ్య, హరిచంద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

23న యూఎస్‌పీసీ ధర్నాను జయప్రదం చేయండి

తల్లాడ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ఈనెల 23న హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని యూఎస్‌పీసీ భాగస్వామ్య సంఘమైన తెలంగాణ ప్రభుత్వ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు కోరారు. బుధవారం తల్లాడ మండలంలోని వివిధ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయని, ఐదు డీఏలు, పీఆర్సీ పెడింగ్‌లో ఉన్నాయని, జీపీఎఫ్‌లోన్ సొమ్ము, టీఎస్జీఎల్ఐ పేమేంట్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సొమ్ము గత రెండేళ్లగా పెండింగ్‌లో ఉన్నాయని, సర్వీస్‌రూల్స్ రూపొందించి బదిలీలు, ప్రమోషన్లు, జరపాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు ఇమ్మానియేల్ రాజు, పుల్లయ్య, అనంత రాములు, గోపాల్, ఉషారాణి, సౌభాగ్యం, రమాదేవి, శివ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

వైరా, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): చెంతనే రిజర్వాయర్ ఉన్నా, పదిరోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నా వైరా మునిసిపాలిటీలోని ప్రజలు తాగునీటి కోసం అలమటిస్తున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. వైరాలో తాగునీటి సమస్యపై బుధవారం సీపీఎం నాయకుల ప్రతినిధి బృందం మునిసిపల్ కమిషనర్ చింతా వేణును కార్యాలయంలో కలిసింది. పది రోజుల నుంచి మునిసిపాలిటీలోని 7,8వార్డులతోపాటు పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిల్చిపోయిందని దాంతో అక్కడి ప్రజలు మంచినీళ్ల కోసం అలమటిస్తున్నారని కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సీపీఎం నాయకులు సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, పైడిపల్లి సాంబశివరావు, యనమద్ది రామకృష్ణ, చావా కళావతి, స్రవంతి పాల్గొన్నారు.